తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

30-06-2026

మంగళవారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 142

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–





# ఆహార పరిశుభ్రతలో హైదరాబాద్ డేంజర్ జోన్!

- హోటల్ భోజనం తింటే ఆసుపత్రుల పాలే
- కుళ్లిపోయిన మాంసం.. సింథటిక్ రంగులు..
- గడువు ముగిసిన నూనెలతో వంటకాల తయారీ
- మెట్రో నగరాల్లో ఆహార పరిశుభ్రత పాటించని 2వ నగరంగా నిలిచిన భాగ్యనగరం
- 2 శాతం హోటళ్లలోనే సేఫ్టీ ప్రమాణాలు
- నివ్వెరపరుస్తున్న ఎఫ్ఎస్ఎస్ఏఐ నివేదిక
- నగరంలోని 25వేల హోటళ్లలో కేవలం 2 శాతం వాటికే సేఫ్టీ రేటింగ్స్
- దేశ రాజధాని ఢిల్లీలో 3,394.. ఐటీ హబ్ బెంగళూరులో 2,200 హోటళ్లు భద్రం.
- ఎఫ్ఎస్ఎస్ఏఐ హెచ్చరికలతో ఆహార ప్రియుల గుండెల్లో రైళ్లు



**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**
తెలంగాణ రాజధాని హైదరాబాద్ ఇప్పుడు ప్రపంచపటంలో ఐటీ, రియల్ ఎస్టేట్ రంగాల్లో దూసుకుపోతూ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. కానీ, అదే సమయంలో దేశవ్యాప్తంగా ఉన్న మెట్రో నగరాల్లో ఆహార పరిశుభ్రత పాటించని రెండవ నగరంగా నిలిచి భాగ్యనగరం తీవ్ర అవమానాన్ని మూటగట్టుకుంది. బిర్యానీలకు, రకరకాల నోరూరించే వంటకాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉంటూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఈ మహానగరంలో.. ఇప్పుడు బయటపడ్డ ఒక నివేదిక ఆహార ప్రియులను ఒక్కసారిగా

మిగతా 2వ పేజీలో..



## పర్యావరణ పరిరక్షణకు సాంకేతికత తోడైంది..!

- విద్యుత్ రంగానికి బ్యాటరీ ఆధారిత ట్రీ ప్రూనర్ల దండయాత్ర
- సమయం, ఇంధన వ్యయం ఆదా..
- బంజారాహిల్స్‌లో ప్రత్యక్ష ప్రదర్శన
- విద్యుత్ పంపిణీ రంగంలో సరికొత్త విప్లవానికి నాంది పలికిన టీజీఎస్పీడీసీఎల్
- బంజారాహిల్స్ అరోరా కాలనీలో బ్యాటరీ యంత్రాలు, బకెట్ ల్యాడర్ వాహనాల లైవ్ డెమో

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**
తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో సరికొత్త పర్యావరణహిత విప్లవం ఆవిష్కృతమైంది. విద్యుత్ లైన్ల సమీపంలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ క్లియరెన్స్ పనులను మరింత సురక్షితంగా, వేగవంతంగా మరియు పర్యావరణానికి ఎటువంటి హాని కలగకుండా నిర్వహించేందుకు టీజీఎస్పీడీసీఎల్ రంగంలోకి తెచ్చిన అత్యాధునిక బ్యాటరీ ఆధారిత ట్రీ ప్రూనర్లు అందరి దృష్టిని

మిగతా 3వ పేజీలో..




## విద్యుత్ సరఫరాలో రాజీ వద్దు

- ట్రీ ట్రిమ్మింగ్, లైన్ మెయింటెనెన్స్ పనులు వేగవంతం చేయాలి
- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్

2

## హరీష్‌రావుకు మెంటల్ బ్యాలెన్స్ తప్పింది

- ప్రతీ ఎన్నికలో బీఆర్ఎస్‌కు ప్రజలు శిక్ష వేస్తూనే ఉన్నారు
- బీజేపీది ఆశ కాదు.. అత్యాశ
- రైతు భరోసా నిధులు వారం రోజుల్లో జమ
- రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి

3





## ముఖం చాటేసిన నైరుతి

- దేశవ్యాప్తంగా వర్షాల కోసం ఎదురుచూపు
- ఏరువాక సాగక రైతన్న ఆందోళన

**న్యూఢిల్లీ, జూన్ 29 :**
దేశంలో నైరుతి రుతుపవనాలు జూన్ 4న కేరళ తీరాన్ని తాకినప్పటికీ, దేశంలోని చాలాప్రాంతాలు ఇంకా వర్షాల కోసం వేచి చూస్తున్నాయి. గత 146 ఏండ్ల వాతావరణ చరిత్రలో ఈ జూన్ నెల అత్యంత పొడిగా నమోదైన నెలల్లో ఒకటిగా నిలిచిందని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు.
మొత్తంగా దేశంలో నైరుతి రుతుపవనాలు మళ్లీ ముఖం చాటేశాయి. జూన్ 4 నుంచి 28 మధ్య

మిగతా 2వ పేజీలో..

## బియ్యం ఎగుమతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

- రాష్ట్రాన్ని ప్రపంచ బియ్యం ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- బియ్యానికి విలువ జోడిస్తే రైతులకు, రైస్ మిల్లర్లకు రెట్టింపు లాభాలు
- మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 29 :**
బియ్యం ఎగుమతులను భారీ స్థాయిలో ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలను పరిశీలిస్తున్నట్లు నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

మిగతా 2వ పేజీలో..






## ఏజెంట్ తో వస్తేనే లోనికి రానిస్తాం!


- ఆటో సంఘ నాయకునికి తేల్చి చెప్పిన రవాణా శాఖ అధికారులు
- ఆర్‌టీవోను సైతం కలవనివ్వలేదు
- తెలంగాణ రక్షణ సేన ఆటో విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎంఏ సలీమ్

3

## రాష్ట్రంలో 26 మంది ఐపీఎస్ అధికారుల బదిలీ

- పోలీస్ శాఖలో భారీ స్థాయిలో స్థానచలనం
- వరంగల్ కొత్త కమిషనర్‌గా ఎన్. శ్వేత నియామకం
- పలువురు అధికారులకు అదనపు బాధ్యతల అప్పగింత
- సీఐడీ, ఇంటెలిజెన్స్ విభాగాల్లో కీలక మార్పులు

2




## ఐఎఫ్ఎస్ అధికారుల బదిలీలు

- పరిపాలనా కారణాలతో ప్రభుత్వం కీలక ఉత్తర్వులు
- అరణ్య భవన్‌లో వి. ఎస్.ఎన్.వి. ప్రసాద్‌కు కీలక బాధ్యతలు
- పలు జిల్లాల్లో అటవీ అధికారుల మార్పులు

2






## హస్మత్‌పేటలో పేదల ఇళ్లు కూల్చలేదు

- అవాస్తవ ప్రచారాలను నమ్మొద్దని అధికారుల విజ్ఞప్తి
- ప్రభుత్వ భూమిలోని కొత్త ఆక్రమణలనే తొలగించినట్లు వెల్లడి
- రూ.750 కోట్ల విలువైన 10 ఎకరాల భూమికి రక్షణ
- రెవెన్యూ శాఖ విజ్ఞప్తి మేరకే హైడ్రా చర్యలు
- ప్రజా అవసరాల కోసం ప్రభుత్వ భూమిని పరిరక్షించడమే లక్ష్యమని స్పష్టం

3

## గ్రామీణాభివృద్ధి పథకాల్లో తెలంగాణ వెనుకబాటు

- కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు

3



## నిజాయతీ, నిబద్ధతతో ప్రజలకు సేవ చేయాలి

- డీజీపీ ఆనంద్
- డీఎస్పీలుగా పదోన్నతి పొందిన 36 మందికి పోస్టింగులు

2






# విద్యుత్ సరఫరాలో రాజీ వద్దు

**మహబూబ్‌నగర్, సిరి న్యూస్:**

వర్షాకాలంలో విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరాను అందించాలని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లాలో విస్తృతంగా పర్యటించిన ఆయన, విద్యుత్ శాఖ కార్యకలాపాలపై నిర్వహించిన సమగ్ర సమీక్షలో భాగంగా క్షేత్రస్థాయి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముందుగా టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని అన్ని ఆపరేషన్ సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజనీర్లు, సీనియర్ అకౌంట్స్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎండీ.. నిర్మాణ కోడ్‌ల మ్యాపింగ్, బిల్లింగ్ వ్యవస్థ, రెవెన్యూ వసూళ్లు, మీటర్ల సమస్యలు మరియు పెండింగ్ కేసుల పరిష్కారంపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం మహబూబ్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో పాల్గొని, వర్షాకాల సన్నద్ధత, వ్యవసాయ విద్యుత్ సరఫరా, ఫీడర్ల పనితీరు, పెండింగ్ అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ, వర్షాకాలంలో విద్యుత్ అంతరాయాలను నివారించేందుకు చెట్ల కొమ్మల తొలగింపు (ట్రీ ట్రిమ్మింగ్), లైన్ మెయింటెనెన్స్ మరియు ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్ అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అలాగే 1912 కాల్ సెంటర్ ద్వారా వచ్చే వినియోగదారుల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని స్పష్టం చేశారు. 202325 మధ్య పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, 202627 సంవత్సరానికి అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలు, మౌలిక వసతుల కల్పనపై కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. సమీక్షా కార్యక్రమాల అనంతరం, మహబూబ్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఏపీటీఎస్ నూతన భవన నిర్మాణానికి సీఎండీ భూమి పూజ చేసి, శంకుస్థాపన చేశారు. అనంతరం దివిటిపల్లిలోని అమర రాజా అడ్వాన్స్డ్ సెల్ టెక్నాలజీస్ సంస్థను సందర్శించి, పారిశ్రామిక రంగానికి విశ్వసనీయ విద్యుత్ సరఫరా చేసేందుకు సంస్థ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అంతకుముందు, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్న ఉద్దేశంతో హరిత తెలంగాణ కార్యక్రమంలో భాగంగా సర్కిల్ కార్యాలయ ప్రాంగణంలో ఆయన మొక్కలు నాటారు. పర్యటనలో భాగంగా జిల్లా స్టోర్స్‌ను సైతం తనిఖీ చేసిన ఆయన, విద్యుత్ నిర్వహణ పనులకు అవసరమైన సామగ్రి నిల్వలు, సరఫరా వ్యవస్థపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే, ఫీల్డ్ అవసరాలకు అనుగుణంగా ఎప్పుడూ సామగ్రి అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ పర్యటనలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్, ఐటీ అండ్ మాస్టర్ ప్లాన్) వట్టికొండ శివాజీ, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పాలకూరి నారాయణ, చీఫ్ ఇంజనీర్ (ఆపరేషన్‌రూరల్ జోన్) జి. బాలస్వామి, ఎస్ఈ జి. భీమా నాయక్, డివిజనల్ ఇంజనీర్లు, ఏడీఈలు, ఏఈలు, అకౌంట్స్ అధికారులు మరియు ఇతర శాఖాధికారులు పాల్గొన్నారు.




# ముఖం చాటేసిన నైరుతి

**మొదటిపేజీ తరువాయి**

సాధారణంగా 141.4 ఎంఎం వర్షం కురవాల్సి ఉండగా ఈసారి 77.1 ఎంఎం వర్షపాతమే నమోదైంది. కదిలే మేఘాలు ఈశాన్య రాష్ట్రాలు, బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతాలు, దక్షిణమధ్య అరేబియా సముద్రానికే పరిమితమయ్యాయి. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన వర్షపాతం పటం రుతుపవనాల అస్థిర ప్రభావాన్ని తెలియజేస్తున్నది. గుజరాత్ 86 శాతం వర్షపాత లోటుతో ఉండగా, మహారాష్ట్రలో 60 శాతం లోటు నమోదైంది. మధ్యప్రదేశ్ లో 42 శాతం, యూపీలో 59 శాతం, బీహార్‌లో 52 శాతం, ఒడిశాలో 53 శాతం, తెలంగాణలో 32 శాతం, కర్ణాటకలో 47 శాతం వర్షపాత లోటు రికార్డయ్యింది. తెలంగాణ రాష్ట్రంలో వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ.. ఎల్ నినో ప్రభావం వల్ల చాలాప్రాంతాల్లో చినుకుజాడ కరువైంది. వానకాలం సాగుపై రైతుల్లో ఆందోళన పెరుగుతున్నది. 15 నాటికి దేశంలోని దక్షిణ, తూర్పు, ఈశాన్య ప్రాంతాలకు విస్తరించిన రుతుపవనాలు, తర్వాత స్తంభించిపోయాయి. దేశంలోని చాలాప్రాంతాల్లో 40 శాతం తక్కువ వర్షపాతం నమోదయ్యింది. జూన్ నెల లోటును భర్తీ చేయడానికి కొంత సమయం పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. వాతావరణంలో తేమ శాతం పెరగడం, సుదీర్ఘ పొడికాలం తర్వాత అకస్మాత్తుగా కురిసే భారీ వర్షాలు, వరదలు వంటి తీవ్ర వాతావరణ పరిస్థితులు భవిష్యత్తులో పెరిగే అవకాశం ఉన్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తెలంగాణకు హైదరాబాద్ వాతావరణశాఖ రెయిన్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, మెదక్, రాజన్న సిరిసిల్ల, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిసేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని వెల్లడించారు.

# నిజాయతీ, నిబద్ధతతో ప్రజలకు సేవ చేయాలి

**హైదరాబాద్, జూన్ 29:**

పోలీసు శాఖలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్(సీఐ) హోదా నుంచి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(డీఎస్పీ)గా పదోన్నతి పొందిన 36మంది అధికారులకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, యూనిట్లలో సోమవారం పోస్టింగులు ఇచ్చారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డీజీపీ సి.వి.ఆనంద్ మాట్లాడుతూ నూతనంగా పదోన్నతి పొందిన అధికారులను అభినందించారు. పదోన్నతి అనేది హోదా పెరగడం మాత్రమే కాదని, అంతకు మించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించే అవకాశం అని పేర్కొన్నారు. రాష్ట్ర పోలీసు శాఖ తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టేలా ప్రతీ అధికారి నిజాయతీ, క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజల సమస్యలను సత్వరమే గుర్తించి, చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించే దిశగా పనిచేయాలని, ప్రజలకు చేరువయ్యే అధికారులుగా మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజలతో సత్సంబంధాల పెంపు, బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడం వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన కోరారు. డీఎస్పీ హోదాలో ప్రతీ నిర్ణయం ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా ఉండాలని, ఉన్నతాధికారుల మార్గదర్శకాలను పాటిస్తూ సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రదర్శించాలని కోరారు. ప్రజల భద్రత, సంక్షేమమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా అంకితభావంతో పనిచేస్తేనే వృత్తిపరంగా మరింత ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని సూచించారు. కాగా, డీఎస్పీలుగా పదోన్నతి పొందిన వీరు లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోస్టింగ్స్ కాక ఇతర విభాగాల్లో తమ సేవలను అందించనున్నారు. కార్యక్రమంలో డీజీ(లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్, తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆహార పరిశుభ్రతలో

# హైదరాబాద్ 'డేంజర్ జోన్'!

**మొదటిపేజీ తరువాయి**

తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. నగరంలో హోటల్ కెళ్తే.. ఆపై ఆసుపత్రి పాలే అన్న కొత్త నానుడి మొదలయ్యేలా పరిస్థితులు తయారయ్యాయి.

**దేశంలోనే చివరి స్థానంలో హైదరాబాద్..**

దేశంలోని ప్రధాన మెట్రో నగరాలతో పోలిస్తే ఆహార పరిశుభ్రత పాటించే విధానంలో హైదరాబాద్ అత్యంత వెనుకబడి, చివరి స్థానంలో నిలిచింది. ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా తాజాగా విడుదల చేసిన అధికారిక గణాంకాలు ఈ భయంకరమైన విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో దాదాపు 25వేల లైసెన్స్ పొందిన హోటళ్లు, రెస్టారెంట్లు, ఈటరీలు వ్యాపారాలు సాగిస్తుండగా.. లైసెన్స్ లేకుండా నడుస్తున్న స్ట్రీట్ ఫుడ్ సెంటర్లు వేలల్లోనే ఉన్నాయి. అయితే, ఇంత పెద్ద సంఖ్యలో ఉన్న హోటళ్లలో కేవలం 2 శాతం అంటే.. కేవలం 361 హోటళ్లు మాత్రమే ఆహార పరిశుభ్రత రేటింగ్‌స్‌ను పొందగలిగాయి. జాతీయ రాజధాని ఢిల్లీలో అత్యధికంగా 3,394 హోటళ్లు, ఐటీ హబ్ బెంగళూరులో 2,200 హోటళ్లు ఈ సేఫ్టీ రేటింగ్స్ కలిగి ఉండగా.. హైదరాబాద్‌లో మాత్రం సురక్షితమైన ఆహార లభ్యత అట్టడుగున ఉండటం గమనార్హం.

**ఫుడ్ సేఫ్టీ తనిఖీల్లో వెలుగులోకి ఘోరమైన వాస్తవాలు**

హైదరాబాద్ నగరంలో నిరంతరం ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎక్కడో ఒకచోట మెరుపు దాడులు నిర్వహిస్తూనే ఉన్నారు. ఈ తనిఖీల్లో ప్రతిసారి కుళ్లిపోయిన మాంసం, పురుగులు పట్టిన కల్తీ ఆహార పదార్థాలు, అత్యంత దారుణమైన అపరిశుభ్రత (మురుగు కాలువల పక్కనే వంటలు) బయటపడుతూనే ఉన్నాయి. చాలా చోట్ల కనీస లైసెన్సులు లేకుండానే విక్రయాలు సాగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. వీటికి తోడు, వంటకాల్లో గడువు ముగిసిన నిత్యావసర ఉత్పత్తులు, కేన్సర్‌కు దారితీసే ప్రమాదకర రసాయన రంగులు, పదే పదే మరిగించిన నాణ్యత లేని నూనెలను విచ్చలవిడిగా వాడుతున్నట్లు అధికారులు కనుగొన్నారు. ఇంత దారుణంగా దాడులు జరుగుతున్నా హోటల్ నిర్వాహకుల్లో కనీస మార్పు రావడం లేదు. దీనికి తోడు, కొందరు అధికారులు కొన్ని రాజకీయ ఒత్తిళ్ల కారణంగా తనిఖీలు చేసినా చూసి చూడనట్టు వ్యవహరించడం కూడా ఈ దారుణమైన పరిస్థితికి కారణమని తెలుస్తోంది.

**హోటల్లో తింటే ఆసుపత్రికి వెళ్లాల్సిందే..**

హైదరాబాద్ మహానగరంలోని హోటళ్లలో తింటే ప్రజల ఆరోగ్యానికి పెను ప్రమాదం ఉందని, జీర్ణకోశ వ్యాధులు, గ్యాస్ట్రో ఎంటరైటిస్, ఫుడ్ పాయిజనింగ్ వంటి సమస్యలతో ఆసుపత్రుల పాలు కాక తప్పదని ఆరోగ్య నిపుణులు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు. ఎన్ని దాడులు జరిగినా హోటల్ నిర్వాహకుల్లో మార్పు రాకపోవడం సమస్యను మరింత జటిలం చేస్తోంది. తినే ఆహారం ఎంత పరిశుభ్రమో తెలుసుకోకుండా, కేవలం రుచికి, రంగులకే మొగ్గు చూపుతున్న ప్రజల్లో కూడా మార్పు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వినియోగదారులు కూడా ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇచ్చి క్వాలిటీ లేని హోటళ్లను బహిష్కరిస్తేనే యాజమాన్యాలలో మార్పు వచ్చే అవకాశం ఉంది.

**ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి**

హైదరాబాద్ హోటళ్ల అపరిశుభ్రత మూలంగా ప్రజారోగ్యం తీవ్రమైన ముప్పులో పడిందని సాక్షాత్తూ ఎఫ్ఎస్ఎస్ఏఐ డేటా హెచ్చరిస్తోంది. ఈ విషయంలో ప్రభుత్వం, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరిస్తే తప్ప హోటళ్ల యాజమాన్యాలు దారికి రావు. లంచాలకు, రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా అక్రమ హోటళ్లపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని, ప్రజారోగ్యానికి ముప్పు తెస్తున్న ఇలాంటి హోటళ్లను శాశ్వతంగా సీజ్ చేయాలని నగరవాసులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# బియ్యం ఎగుమతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

**మొదటిపేజీ తరువాయి**

వెల్లడించారు. రాష్ట్రాన్ని దేశంలోనే కాక ప్రపంచ స్థాయి బియ్యం ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో కేసీపీ న్యూట్రీ సంస్థ రూపొందించిన మల్టీ విటమిన్ రైస్ ఉత్పత్తులను సోమవారం ప్రారంభించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న బియ్యానికి దేశీయ మార్కెట్‌తోపాటు అంతర్జాతీయ మార్కెట్లలోనూ విస్తృత అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. 'ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుంది కానీ ఎగుమతుల కోసం కాదని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానంతో ముందుకు వెళ్లి బియ్యం ఎగుమతులను ప్రోత్సహించే దిశగా చర్యలు చేపడుతోంది' అని తెలిపారు. రాష్ట్ర రైతులు, రైస్ మిల్లర్ల ప్రయోజనాల కోసం దేశీయ మార్కెట్లతోపాటు విదేశీ మార్కెట్లను కూడా లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఎగుమతులు చేపట్టే పరిశ్రమలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, అవసరమైన అనుమతులను వేగంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

**దేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ**

తెలంగాణ వ్యవసాయ రంగం సాధించిన ప్రగతిని వివరిస్తూ ఈ ఏడాది యాసంగి సీజన్‌లోనే రాష్ట్ర ప్రభుత్వం 81 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని, అదే సమయంలో భౌగోళికంగా పెద్ద రాష్ట్రం అయిన ఏపీలో 25 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు మాత్రమే జరిగిందని మంత్రి తెలిపారు. ఇది తెలంగాణ వ్యవసాయ సామర్థ్యానికి, రైతుల శ్రమకు, తమ ప్రభుత్వ రైతు అనుకూల విధానాలకు నిదర్శనం అని అన్నారు. యాసంగి ధాన్యం కొనుగోలు కోసం రైతుల బ్యాంకు ఖాతాల్లోకి ఇప్పటికే రూ.19,303 కోట్లను నేరుగా జమ చేసినట్లు వెల్లడించారు. పారదర్శకతతో, వేగవంతంగా రైతులకు చెల్లింపులు జరిపిన రాష్ట్రంగా నిలిచిందన్నారు. వానాకాలం, యాసంగి సీజన్లను కలిపి చూస్తే రాష్ట్రంలో బియ్యం ఉత్పత్తి 300 లక్షల మెట్రిక్ టన్నులు (300 ఎలఎంటీలు) దాటిందని తెలిపారు. రాష్ట్ర ప్రజల వినియోగం ఏడాదికి 36 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ఉండటంతో తెలంగాణ ఇప్పుడు మిగులు బియ్యం ఉత్పత్తి రాష్ట్రంగా ఎదిగిందని పేర్కొన్నారు.

**విలువ జోడింతోనే భవిష్యత్తు**

రైస్ పరిశ్రమ ఆధునిక సాంకేతికతను స్వీకరించాలని మంత్రి పిలుపునిచ్చారు. మల్టీ విటమిన్ రైస్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తులు ప్రజల ఆరోగ్యానికి మేలు చేయడంతోపాటు అంతర్జాతీయ మార్కెట్లలోనూ మంచి ఆదరణ పొందే అవకాశముందని చెప్పారు 'తెలంగాణలో మాత్రమే విక్రయాలపై ఆధారపడకుండా దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లను లక్ష్యంగా చేసుకోవాలి.. రాష్ట్ర ఉత్పత్తులు ఇతర రాష్ట్రాలు, విదేశీ మార్కెట్లకు చేరేలా ప్రభుత్వం అవసరమైన ప్రతి సహాయాన్ని అందిస్తుంద'ని ఉత్తమ్ స్పష్టం చేశారు.

**సాగునీటి విప్లవమే వ్యవసాయ విజయానికి పునాది**

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల ఆధునీకరణ, సాగునీటి విస్తరణ, రైతులకు నిరంతర నీటి లభ్యత కల్పించడం వల్లే రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని మంత్రి తెలిపారు. సాగునీటి రంగంలో ప్రభుత్వం చేపట్టిన భారీ పెట్టుబడుల ఫలితంగానే దేశంలో అగ్రగామి ధాన్య ఉత్పత్తి రాష్ట్రంగా అవతరించినట్లు పేర్కొన్నారు. రైతుల ఆదాయం పెరగడం, రైస్ మిల్లింగ్ పరిశ్రమ బలోపేతం కావడం, బియ్యం ఎగుమతుల ద్వారా రాష్ట్రానికి ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో 26 మంది ఐపీఎస్ అధికారుల బదిలీ

**హైదరాబాద్, జూన్ 30:**

తెలంగాణ పోలీస్ శాఖలో ప్రభుత్వం భారీ స్థాయిలో ఐపీఎస్ అధికారులను బదిలీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 26 మంది అధికారులకు కొత్త పోస్టింగ్‌లు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పరిపాలనా అవసరాలు, శాంతిభద్రతల నిర్వహణను మరింత సమర్థంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ మార్పులు చేపట్టినట్లు ప్రభుత్వం పేర్కొంది.

**కీలక పోస్టుల్లో మార్పులు**

హైదరాబాద్ నార్త్ రేంజ్ జాయింట్ కమిషనర్‌గా ఉన్న ఎన్. శ్వేతను వరంగల్ పోలీస్ కమిషనర్‌గా నియమించారు. ఆమెకు భద్రాద్రి జోన్4 డీఐజీగా పూర్తి అదనపు బాధ్యతలు కూడా అప్పగించారు. వరంగల్ కమిషనర్‌గా పనిచేసిన సన్‌ప్రీత్ సింగ్‌ను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా బదిలీ చేసి, రాజన్న జోన్3 డీఐజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్ స్పెషల్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్ ఎస్.ఎం. విజయ్ కుమార్‌కు హైదరాబాద్ నార్త్ రేంజ్ శాంతిభద్రతల జాయింట్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు కేటాయించారు.

**వివిధ విభాగాల్లో నియామకాలు**

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝాకు కాళేశ్వరం జోన్1 డీఐజీగా, హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డి. జోయెల్ డేవిస్‌కు యాదాద్రి జోన్5 డీఐజీగా, ఇంటెలిజెన్స్ సీఐ సెల్ డీఐజీ ఆర్. భాస్కరన్‌కు బాసర జోన్2 డీఐజీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఏసీబీ జాయింట్ డైరెక్టర్ చి. సింధు శర్మను హైదరాబాద్ ఇంటెలిజెన్స్ సీఐ సెల్ ఎస్పీగా బదిలీ చేసి, ఎస్ఐబీ ఎస్పీగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఎస్ఐబీ ఎస్పీ వై. సాయి శేఖర్‌ను సికింద్రాబాద్ రైల్వే పోలీస్ సూపరింటెండెంట్‌గా నియమించారు. హైదరాబాద్ డీసీపీ చెర్నూరి రూపేష్, ఏసీబీ జాయింట్ డైరెక్టర్ చి. ప్రవీణ్ కుమార్‌లను సీఐడీ ఎస్పీలుగా బదిలీ చేశారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆర్. వెంకటేశ్వర్లును హైదరాబాద్ సిటీ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీగా నియమిస్తూ, గతంలో జారీ చేసిన సీఐడీ ఎస్పీ నియామక ఉత్తర్వులను ప్రభుత్వం రద్దు చేసింది. వనపర్తి అదనపు ఎస్పీ రాజేష్ మీనాను వికారాబాద్ అదనపు ఎస్పీ (అడ్మిన్)గా బదిలీ చేయగా, బి. రాములు నాయక్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది.

# ఏరువాక పౌర్ణమి.. రైతుకు వ్యవసాయ నూతన సంవత్సరాది

**సిద్దిపేట, జూన్ 29 :**

తెలంగాణ పల్లెల్లో వ్యవసాయం కేవలం వృత్తి మాత్రమే కాదు.. అది జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయం. ఆ రైతు జీవితంలో అత్యంత విశిష్టమైన రోజుల్లో ఏరువాక పౌర్ణమి ఒకటి. జ్యేష్ఠ మాసం పౌర్ణమి రోజున జరుపుకునే ఈ పండుగతో రైతులు కొత్త వ్యవసాయ సీజన్ కు శ్రీకారం చుడతారు. భూమాతను, పశువులను పూజించి, మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థిస్తూ పొలాల్లో మొదటి నాగలి దున్నడం ఈ పండుగ ప్రధాన విశేషం.

**'ఏరువాక' అంటే ఏమిటి?**

'ఏరు' అంటే నాగలి, 'వాక' అంటే ప్రారంభం. అంటే నాగలితో పొలాన్ని దున్ని వ్యవసాయ పనులను ప్రారంభించడం. అందుకే దీనికి ఏరువాక అనే పేరు వచ్చింది. పౌర్ణమి రోజున జరుపుకోవడం వల్ల దీనిని ఏరువాక పౌర్ణమిగా పిలుస్తారు. వేసవి ముగిసి తొలి వర్షాలు కురిసిన తర్వాత భూమి సాగుకు అనుకూలంగా మారుతుంది. ఈ సమయంలోనే రైతులు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకొని వ్యవసాయ పనులను ప్రారంభిస్తారు. ఈ ప్రారంభానికి ప్రతీకగా ఏరువాక పౌర్ణమిని జరుపుకుంటారు.

**ఏరువాక నాటి సంప్రదాయాలు**

తెల్లవారుజామున రైతులు స్నానం చేసి భూమాతకు ప్రత్యేక పూజలు చేస్తారు. నాగలి, గొడ్డలి, ఇతర వ్యవసాయ పరికరాలను శుభ్రపరచి పసుపు, కుంకుమతో అలంకరిస్తారు. ఎద్దులకు స్నానం చేయించి రంగురంగుల వస్త్రాలు, గంటలు, పూలమాలలతో అలంకరిస్తారు. కొబ్బరికాయ కొట్టి, పూజలు చేసి ఎద్దులతో మొదటిసారి పొలాన్ని దున్నుతారు. కొంత విత్తనాన్ని పొలంలో చల్లి, మంచి పంటలు పండాలని దేవుడిని ప్రార్థిస్తారు. గ్రామాల్లో రైతులు పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుంటూ పండుగ వాతావరణంలో పాల్గొంటారు.

**శాస్త్రీయ కోణం కూడా ఉంది**

ఏరువాక పౌర్ణమి ఆచారం మాత్రమే కాదు. తొలి వర్షాల తర్వాత నేలలో తేమ పెరగడం వల్ల దున్నడానికి అనువైన సమయం ఇదే. ఈ సమయంలో సాగు ప్రారంభిస్తే పంటల ఎదుగుదలకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రైతులు భూమిని తల్లిగా కొలుస్తారు. అందుకే సాగు ప్రారంభించే ముందు భూమాతకు పూజలు చేసి, ప్రకృతికి కృతజ్ఞతలు తెలియజేస్తారు. రైతు, భూమి, పశువుల మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసే పండుగే ఏరువాక పౌర్ణమి. వ్యవసాయంలో యంత్రాల వినియోగం పెరిగినా రాష్ట్రంలోని అనేక గ్రామాల్లో ఇప్పటికీ ఏరువాక పౌర్ణమిని సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. ట్రాక్టర్లకు పూజలు చేయడం, విత్తనాలను ఆశీర్వదించడం, రైతులు కలిసి వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టడం వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఏరువాక పౌర్ణమి రైతు కష్టానికి, ప్రకృతిపై విశ్వాసానికి, భూమాత పట్ల కృతజ్ఞతకు ప్రతీక. ఇది కేవలం ఒక పండుగ కాదు.. వ్యవసాయ సంస్కృతిని తరతరాలకు అందించే జీవనోత్సవం. రైతు సంతోషమే రాష్ట్ర సంతోషమనే సందేశాన్ని ఈ పండుగ ప్రతి ఏడాది గుర్తు చేస్తూనే ఉంటుంది.

# ఐఎఫ్ఎస్ అధికారుల బదిలీలు

- **పరిపాలనా కారణాలతో ప్రభుత్వం కీలక ఉత్తర్వులు**
- **అరణ్య భవన్‌లో వి.ఎస్.ఎన్. వి. ప్రసాద్‌కు కీలక బాధ్యతలు**
- **పలు జిల్లాల్లో అటవీ అధికారుల మార్పులు**
- **ఆదిలాబాద్ డీఎఫ్‌వోగా చిన్న విశ్వనాథ్‌కు అదనపు బాధ్యతలు**
- **కొత్త స్థానాల్లో వెంటనే బాధ్యతలు చేపట్టాలని ఆదేశం**

**హైదరాబాద్, జూన్ 29:**

రాష్ట్రంలో అటవీ శాఖ పరిపాలనను మరింత సమర్థంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం పలువురు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారులను బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారులు వెంటనే తమ ప్రస్తుత బాధ్యతలను అప్పగించి, కొత్తగా కేటాయించిన స్థానాల్లో విధులు చేపట్టాలని ఆదేశించారు.

**అరణ్య భవన్‌లో కీలక నియామకం**

పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న వి.ఎస్.ఎన్.వి. ప్రసాద్‌ను హైదరాబాద్‌లోని అరణ్య భవన్‌లో ప్రధాన అటవీ సంరక్షణాధికారి కార్యాలయంలో ప్రణాళిక, విజిలెన్స్ విభాగం కన్సర్వేటర్‌గా నియమించింది. రాష్ట్ర అటవీ శాఖలో కీలక బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

**జిల్లాల్లో అధికారుల మార్పులు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ అధికారిగా పనిచేస్తున్న జి. కిష్ట గౌడ్‌ను జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు బదిలీ చేశారు. నిజామాబాద్ జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు నియమించారు. మహబూబ్‌నగర్ జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్‌ను రంగారెడ్డి జిల్లాకు బదిలీ చేయగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అటవీ అధికారి ఎం. నవీన్ రెడ్డిని మహబూబ్‌నగర్ జిల్లాకు నియమించారు. ఆదిలాబాద్ జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్‌ను నిజామాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. ఆదిలాబాద్ అటవీ విభాగంలో పనిచేస్తున్న చిన్న విశ్వనాథ్ భూసారెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆమె తన ప్రస్తుత విధులతో పాటు ఆదిలాబాద్ జిల్లా అటవీ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

# గ్రామీణాభివృద్ధి పథకాల్లో తెలంగాణ వెనుకబాటు

**న్యూఢిల్లీ, జూన్ 29:**

గ్రామీణ పథకాల అమలులో తెలంగాణ వెనుకబడి ఉందని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయా పథకాల అమలును పరిశీలించినప్పుడు ఇది కనిపించిందన్నారు. న్యూఢిల్లీలో గ్రామీణాభివృద్ధి పథకాల అమలుపై మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అధ్యక్షతన సమావేశం సోమవారం జరిగింది. సమావేశానికి 27 రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రం గురించి ఆయన మాట్లాడుతూ పీఎంజీఎస్‌వై రహదారుల పనులు వేగవంతం కావాలని చెప్పారు. పెండింగ్ రహదారి పనులు పూర్తి చేయాలని సూచించారు. పీఎం ఆవాస్ సర్వే త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రితోపాటు ఉన్నతాధికారులను ఆదేశించారు. గ్రాణాభివృద్ధి శాఖలో ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని స్పష్టం చేశారు. అలాగే గ్రామాల అభివృద్ధే వికసిత్ భారత్‌కు పునాది కావాలని ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన సూచించారు. జులై 1వ తేదీ నుంచి వికసిత్ భారత్ గ్రామీణ యోజన అమలు చేస్తున్నట్లు చెప్పారు. నిధుల వాటా సమయానికి విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర మంత్రి కోరారు. గ్రామీణాభివృద్ధి పథకాల అమలులో ముందంజలో ఉందంటూ ఆంధ్రప్రదేశ్‌పై కేంద్ర మంత్రి ప్రశంసలు కురిపించారు. వీబీజీఆర్‌ఎంజీఐకి నోటిఫికేషన్ పూర్తి చేసిన రాష్ట్రాల జాబితాలో ఏపీ ఉందన్నారు. జులై 2న తిరుపతిలో వీబీజీఆర్‌ఎంజీఐ ప్రారంభిస్తామని ప్రకటించారు. ఈ జాతీయ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ఆతిథ్య రాష్ట్రంగా ఏపీని ఎంపిక చేశామన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన నాణ్యతలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రాల్లో ఏపీకి స్థానం దక్కిందని మంత్రి శివరాజ్‌సింగ్ పేర్కొన్నారు.



**తెలంగాణ వాదనలను బలంగా వినిపించిన సీతక్క**

వీబీజీ రాం జీ పథకం చట్టంపై తెలంగాణ వాదనలను మంత్రి సీతక్క బలంగా వినిపించారు. తెలంగాణ చేసిన సూచనలు, లేవనెత్తిన అభ్యంతరాలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ముఖ్యంగా హౌసింగ్ స్కీమ్, ప్లాంటేషన్, రాష్ట్రాలు కోరుకున్న విధంగా ఉపాధి హామీలో భాగంగా పనులు నిర్ణయించుకునే వెసులుబాటు కల్పించాలని సీతక్క గట్టిగా కోరారు. ఆ మేరకు కేంద్రం అనుమతులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు, చట్టంలో పలు మార్పులు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**కేంద్రం సహకరిస్తేనే రాష్ట్రాల అభివృద్ధి : సీతక్క స్పష్టీకరణ**

కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి పథకాలకు సంబంధించి తీసుకువస్తున్న సరికొత్త విధానాలపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. వీబీ జీ రామ్ జీ పథకంపై అభ్యంతరాలను కేంద్రానికి మంత్రి సీతక్క తెలియజేశారు. జులై 2న వీబీ జీ రామ్ జీపై తమ కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. వీబీ జీ రామ్ జీని కొనసాగించాలా లేక ఆ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం ప్రవేశపెట్టాలా అనే దానిపై ఆలోచన చేస్తామన్నారు. వీబీ జీ రామ్ జీ పథకం 60:40 నిధుల విధానంపై తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం పెడితే కేంద్రం నిధులు ఇవ్వదని, 100శాతం ఆర్థిక భారం రాష్ట్రంపై పడుతోందని వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు పలు కీలక సమస్యలు, నిధుల విడుదల అంశాలపై వినతిపత్రం సమర్పించారు. 'వికసిత్ గ్రామాలు 2047' అనే గొప్ప ఆశయం నెరవేరాలన్నా, గ్రామీణ ప్రాంతాలు స్వయంసమృద్ధి సాధించాలన్నా రాష్ట్రాలపై కేంద్రం అదనపు ఆర్థిక భారం మోపకూడదని ఆమె స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన విబిజి రామ్ లో ప్రవేశపెడుతున్న 60:40 నిధుల విధానంపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఈ నూతన ఆర్థిక సకరణ వల్ల రాష్ట్రాలపై ఊహించని రీతిలో భారీ ఆర్థిక భారం పడుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. జూలై 2న జరగబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఈ నిబంధనలపై ఒక తుది నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రాణ ఉపాధి హామీ పథకంలో గతంలో ఉన్నట్లుగానే 100 శాతం వేతనాల విధానాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. మెటీరియల్ కాంపోనెంట్‌కు సంబంధించి కూడా గతంలో ఉన్న 75 శాతం కేంద్ర వాటాను అలాగే ఉంచాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కేంద్ర నిధులు కోల్పోకుండానే, రాష్ట్ర ప్రయోజనాలను పూర్తిస్థాయిలో కాపాడేలా తమ ప్రభుత్వం ముందడుగు వేస్తుందని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన కింద రాష్ట్రంలో చేపట్టే గ్రాణ రోడ్ల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు ప్రధాన అడ్డంకిగా మారాయని మంత్రి సీతక్క కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆదిలాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్లమల అటవీ ప్రాంతాల్లో అనేక రోడ్డు పనులు పూర్తిగా నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రోడ్లే కాక ఏజెన్సీ ప్రాంతాల్లోని పేదలకు ఇళ్లు, బోర్‌వెల్లు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు కూడా అర్ధాంతరంగా ఆగిపోయాయని వివరించారు. ఈ క్లియరెన్స్ ప్రక్రియను వేగవంతం చేయడంతోపాటు, రాష్టనికి రావాల్సిన పీఎం ఆవాస్ యోజన గృహాల కేటాయింపులను కేంద్రం వెంటనే విడుదల చేయాలని కోరారు. నిధుల విడుదలలో జాప్యం వల్ల పనులు మందగిస్తున్నాయని, రాష్ట్రంలో అధికారుల తరచూ బదిలీల వల్ల కూడా కేంద్రానికి నివేదికలు సమర్పించడంలో కొంత ఆలస్యం జరిగిందని అంగీకరించారు. ఇన్ని సవాళ్లు ఉన్నప్పటికీ గ్రాణాభివృద్ధిలో అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తోందని మంత్రి సీతక్క గర్వంగా ప్రకటించారు. జల్ సంచార్ విభాగంలో రాష్ట్రానికి ఏకంగా 13 జాతీయ అవార్డులు రావడం తమ ప్రభుత్వ సమర్థవంతమైన పనితీరుకు నిదర్శనమన్నారు. అలాగే, దేశవ్యాప్తంగా 100 రోజుల ఉపాధి కల్పనను అమలు చేయడంలో దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. రాష్ట్రాలపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తేనే గ్రామాల అభివృద్ధి మరింత వేగంగా సాధ్యమవుతుందని కేంద్ర మంత్రికి వివరించారు. 100 రోజుల ఉపాధి కల్పనలో తెలంగాణ.. దేశంలో రెండో స్థానంలో ఉందని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వద్దనడంతో పీఎం ఆవాస్ గృహాల కేటాయింపులు లేవని., ఇప్పుడు వెంటనే ఇవ్వాలని కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం కోరుతోందన్నారు. తెలంగాణ నుంచి పన్నుల వాటా తీసుకుంటున్నప్పుడు కేంద్ర పథకాలు రాష్ట్రంలో అమలు చేయాలని తెలిపారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు అటవీ క్లియరెన్స్‌పై వినతిపత్రం అందజేసినట్లు మంత్రి తెలిపారు. కేంద్రం నుంచి నిధుల విడుదలలో కూడా జాప్యం జరుగుతోందన్నారు. తరచూ అధికారుల బదిలీలతో నివేదికల సమర్పణలో ఆలస్యం జరిగిందని అన్నారు.



# ఏజెంట్ తో వస్తేనే లోనికి రానిస్తాం!

**మెహదీపట్నం, సిరి న్యూస్:**

రెండ్రోజుల క్రితం రవాణా శాఖ లో ఏజెంట్లకు నో ఎంట్రీ అంటూ సాక్షాత్తు ఆ శాఖ జాయింట్ కమిషనర్ ప్రకటన చేసారు. నేడేమో ఓ ఆటో సంగం నేతను రవాణాశాఖ కార్యాలయంలోకి రావాలంటే ఏజెంట్ తో రావాలని చెప్పారు. రవాణాశాఖలో ఆటో సంఘాల నేతలకు నో ఎంట్రీ....ఏజెంట్ ద్వార వస్తేనే అనుమతి అనే నిబంధనలతో ఆటో సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏజెంట్ ల దగ్గరకు పోవద్దని జాయింట్ కమిషనర్ చెబితే మీరేమో ఏజెంట్ను తీసుకురమ్మంటున్నారని ప్రశ్నించినందుకు పోలీస్ కేసు నమోదు చేస్తానని ఒక ఆటో నాయకున్ని హెచ్చరించిన సంఘటన హైదరాబాద్ వెస్ట్ (మెహిదీపట్టణం) కార్యాలయంలో జరిగిందని ఆటో సంఘాల నాయకుడు, తెలంగాణ రక్షణ సేన ఆటో విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఏ. సలీమ్ ఆరోపించారు. సోమవారం కనీజ్ ఫాతిమా అనే మహిళకు సంబంధించిన ఆటో రిజిస్ట్రేషన్ కోసం టీఆర్ఎస్ ఆటో విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఎంఏ సలీమ్ హైదరాబాద్ వెస్ట్ కార్యాలయంకు వెళ్లారు. తనను తాను మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ చుండూర్ శ్రీనివాస్‌రావుకు పరిచయం చేసుకుని వచ్చిన పనిని వివరించానని, దానితో ఎంవీఐ ఇక్కడ ఆటో సంఘాల నాయకులకు ఎంట్రీ లేదని, ఏ పనికైనా ఏజెంట్ ద్వారనే సంప్రదించాలని తెలిపారని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో ఎందుకు ఎంట్రీ లేదని ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగిందన్నారు. దీనితో ఎంవీఐ ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని, ఎక్కువ చేస్తే పోలీసులను పిలుస్తానని బెదిరించడం జరిగిందన్నారు. ఎంవీఐ పై పిర్యాదు చేయడానికి ఆర్‌టీవో దగ్గరకు వెళ్లి తన విజిటింగ్ కార్డు ఇచ్చినప్పటికి లోపలకు అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు. ఎవరికి చెప్పుకున్న భయం లేదని , ఎవరి వద్ద పని ఉంటే వారినే కలవాలని చెప్పడంలో వెనుదిరిగి వచ్చినట్లు టీఆర్ఎస్ ఆటో సంఘ నాయకులు సలీమ్ పేర్కొన్నారు. మెహిదీపట్టణం రవాణాశాఖ కార్యాలయంలో డబ్బులు ఇవ్వనిదే ఫైల్ ముందుక కదలడం లేదన్నారు. రవాణాశాఖ ఉన్నతాధికారులు అవినీతిని అరికట్టడానికి వ్యవస్థలో ఒక వైపు సమూల మార్పులు తీసుకుని వస్తుంటే మరో వైపు కిందిస్థాయి అధికారులు డబ్బులు లేకుండా ఫిట్‌నెస్, రిజిస్ట్రేషన్, ఎల్ఎల్ఆర్ వంటి ఏలాంటి పని కూడా చేయడం లేదని ఆరోపించారు. ఆటో సంఘాల నాయకులకు ఎంట్రీ లేదంటే వారు ఏమైన సంఘ విద్రోహ శక్తులా అని సలీమ్ ప్రశ్నించారు. ఒక మహిళతో తాను వెళ్లి ఆటో రిజిస్ట్రేషన్ చేయండని అడిగినందుకు ఎంవీఐ ఇష్టానుసారంగా మాట్లాడారని, రవాణాశాఖ కమిషనర్ వెంటనే సదరు ఎంవీఐపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# హరీష్‌రావుకు మెంటల్ బ్యాలెన్స్ తప్పింది

**హైదరాబాద్, జూన్ 29 :**

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీష్‌రావు మాట్లాడుతున్న తీరు చూస్తుంటే ఆయనకు మెంటల్ బ్యాలెన్స్ తప్పిందనే అనుమానం కలుగుతోందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వ్యాఖ్యానించారు. సచివాలయంలోని తన కార్యాలయంలో సోమవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేయాలి అన్న హరీష్‌రావు వ్యాఖ్యలపై పైవిధంగా స్పందించారు. ప్రజానీకం తమకు ఐదేళ్లకు అధికారమిచ్చారు.. రెండున్నరేళ్లకే ఎందుకు అసెంబ్లీని రద్దు చేస్తాం.. ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది అని తెలిపారు. గత రెండున్నరేళ్లలో జరిగిన ప్రతీ ఎన్నికలోనూ ప్రజల తీర్పు ఏవిధంగా ఉందో ఆయనకు తెలుసు.. ఇప్పుడు కొత్తగా వచ్చే తీర్పు ఏముంది అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం చేసే మంచి పనులను జీర్ణించుకోలేక భవిష్యత్తులో అధికారం దక్కదనే ఆవేశం, ఆక్రోశంతో కేటీఆర్ ఉక్రోషాన్ని వెళ్లగక్కుతున్నారన్నారు. 'తన నియోజకవర్గం పాలేరులో కేటీఆర్ విమర్శలు ఇదే కోవలోకి వస్తాయన్నారు. బీఆర్ఎస్ నాయకుల చిల్లర విమర్శలకు ప్రతిసారీ స్పందించను.. ఎప్పుడో ఒకసారి కచ్చితంగా కర్రు కాల్చి వాత పెడతా. కేటీఆర్‌ను అరెస్టు చేస్తేనే బాంబులు పేలినట్టుకాదు. ప్రజలు ఛీకొట్టినా బాంబులు పడ్డట్టేనన్నారు. ఏ వ్యక్తిపైనా కక్షపూరితమైన చర్యలు తీసుకోవాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేద'ని చెప్పారు. వాళ్ళను జైలులో వేస్తేనే శిక్షించినట్లు కాదు.. ప్రతీ ఎన్నికలో వాళ్లను ఓడించి ప్రజలు శిక్షిస్తూనే ఉన్నారు.. తమిళనాడు లాంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో తీసుకురాము అని స్పష్టం చేశారు. అధికారంలోకి వస్తామని బీజేపీ పగటికలలు కంటోంది.. ఆశ ఉండడంలో తప్పు లేదు కానీ ఆ పార్టీ అత్యాశకు పోతోంది అని విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కనీసం డిపాజిట్ రాని పార్టీ అధికారం గురించి ఆశ పడుతోందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకే తాను ముక్కలన్నారు. కాళేశ్వరం అవినీతి, థర్మల్ పవర్ ప్లాంట్ అక్రమాలపై సీబీఐ విచారణ చేయాలని అడిగితే బీజేపీ ఇప్పటివరకు స్పందించలేదన్నారు. ఈసారి రైతు భరోసా నిధులను అనుకున్నదానికంటే రెండుమూడు రోజుల ముందే వారం రోజుల్లోనే రైతుల ఖాతాలో జమ చేస్తామని చెప్పారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటివరకు 18 నియోజకవర్గాలలో 23 స్థలాలను గుర్తించామన్నారు. కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు. భూముల ధరల సవరణలు ఎక్కడైనా పొరపాటుగా ఎక్కువ ధర నిర్ణయిస్తే సరిచేయడానికి సిద్ధంగా ఉన్నామని, తాండూరులో ఇలాగే జరిగితే సరిదిద్దామని మంత్రి పొంగులేటి చెప్పారు.

# కొడంగల్‌లో 33వేల డూప్లికేట్ ఓట్లు

**హైదరాబాద్ , జూన్ 29:**

దేశంలో ఇప్పటివరకు ఎనిమిదిసార్లు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 'సర్' జరిగిందని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. బోధన్ నియోజకవర్గంలో ఏడాదిలో 7 వేల ఓట్లు తీసేశారని, ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో కవిత సోమవారం మీడియాతో మాట్లాడారు. సినీ నటుడు ప్రకాశ్‌రాజ్‌కు రెండుచోట్ల ఓట్లు ఉండగా వీటిని తొలగించేందుకు ఏడేళ్లు పట్టిందని ప్రస్తావించారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొండగల్‌లో 800 ఓట్లు మాత్రమే తొలగించారని, తాము వెరిఫై చేస్తే 33వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని చెప్పారు. మొన్నటి ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి 32వేల మెజారిటీతో గెలిచారని, ఈ డూప్లికేట్ ఓట్లతోనే గెలిచారని తమకు అనుమానం ఉందని అన్నారు. రాష్ట్రంలో డూప్లికేట్ ఓట్లు చాలా ఉన్నాయని తెలిపారు. కర్ణాటక నుంచి నోటు ట్రాన్స్‌ఫర్‌తోపాటు ఓటు ట్రాన్స్‌ఫర్ అయిందా అనే అనుమానం కలుగుతోందని కవిత పేర్కొన్నారు. ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 'సర్' దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్రాల మధ్య ఉన్న డేటాను వెంటనే పరిశీలించాలని సూచించారు. హైదరాబాద్‌లో ఉన్న ఓటర్లకు ఏపీలో కూడా ఓటు ఉందని, ఒకచోట మాత్రమే ఓటు ఉండేలా చూడాలని సూచించారు. ఇంటర్ స్టేట్ డూప్లికేట్ ఓట్లను తొలగించాలన్నారు. ఈ విషయాలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామనన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు 'సాంకేతికత' తోడైంది..!

**మొదటిపేజీ తరువాయి**

ఆకర్షిస్తున్నాయి. ఈ సాంకేతికత పనితీరును పౌరులకు, మీడియాకు వివరించేందుకు సోమవారం బంజారాహిల్స్‌లోని అరోరా కాలనీ, శ్రీనికేతన్ పరిసరాల్లో ప్రత్యేక ప్రత్యక్ష ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. బకెట్ ల్యాడర్ వాహనాలతో పాటు ఈ బ్యాటరీ ట్రీ ప్రూనర్ల ప్రయోజనాలను, పెట్రోల్ ఆధారిత పరికరాలతో పోలిస్తే వీటికున్న ప్రత్యేకతలను విద్యుత్ అధికారులు, బ్యాటరీ సంస్థ ప్రతినిధులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో ప్రదర్శించి చూపారు.






**11 కేవీ విద్యుత్ లైన్ల నిర్వహణలో కీలక పాత్ర**

సాధారణంగా వర్షాకాలం, గాలివానల సమయంలో చెట్ల కొమ్మలు 11 కేవీ విద్యుత్ లైన్లను తాకడం వల్ల ఫీడర్ ట్రిప్పింగ్‌లు, ఫ్యూజ్ఆఫ్ కాల్స్, కండక్టర్లు తెగిపోవడం వంటి తీవ్ర సమస్యలు ఎదురవుతుంటాయి. ఈ సమస్యలకు బ్యాటరీ ఆధారిత ట్రీ ప్రూనర్లు శాశ్వత పరిష్కారంగా నిలుస్తున్నాయి. గతంలో చెట్లెక్కి చేతి పరికరాలతో కొమ్మలు నరికేందుకు ఎక్కువ సమయం, ఎక్కువ మంది సిబ్బంది అవసరమయ్యేది. ఇప్పుడు ఈ పరికరాల ద్వారా తక్కువ సమయంలో, తక్కువ మంది సిబ్బందితోనే పని పూర్తవుతోంది. ఫలితంగా విద్యుత్ నిలిపివేత సమయం గణనీయంగా తగ్గి, వినియోగదారులకు అత్యంత వేగంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరించబడుతోంది. ఒకే రోజులో ఎక్కువ ప్రాంతాల్లో మెయింటెనెన్స్ పనులు చేపట్టేందుకు వీలవుతోంది.

**ఉద్యోగుల భద్రతకు పెద్దపీట..**

ఈ అత్యాధునిక పరికరాల వల్ల క్షేత్రస్థాయి సిబ్బందికి కొండంత భద్రత లభిస్తోంది. ఈ పరికరం ద్వారా కార్మికులు ప్రమాదకరంగా చెట్లెక్కాల్సిన అవసరం చాలా వరకు ఉండదు. నేలపై నుంచే లేదా సురక్షిత దూరం నుంచే ఎత్తైన కొమ్మలను సులభంగా తొలగించవచ్చు. దీంతో విద్యుత్ షాక్‌లకు గురికావడం, చెట్లపై నుంచి కింద పడటం వంటి ప్రాణాంతక ప్రమాదాల అవకాశాలు పూర్తిగా తగ్గుతాయి. ఇవి జర్మన్ ఇంజినీరింగ్ ప్రమాణాలతో రూపొందించబడి, ఆస్ట్రియాలో తయారైన అంతర్జాతీయ స్థాయి ప్రొఫెషనల్ గ్రేడ్ పరికరాలు కావడంతో భద్రత పరంగా అత్యంత నమ్మకమైనవని కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. వీటికి సంబంధించిన విడిభాగాల లభ్యతతో పాటు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కూడా ఇస్తున్నట్లు తెలిపారు.

**ఆర్థిక నష్టాల నివారణ.. పెరగనున్న డిస్కం ఆదాయం**

తరచూ జరిగే విద్యుత్ అంతరాయాల వల్ల డిస్కమ్‌లకు భారీగా ఆదాయ నష్టం కలగడమే కాకుండా, అత్యవసర మరమ్మతుల వ్యయం భారంగా మారుతుంది. ముందస్తుగా ఈ యంత్రాల ద్వారా కొమ్మలను తొలగించడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్లు, ఇన్సులేటర్లు వంటి విలువైన విద్యుత్ పరికరాలు రక్షించబడతాయి. దీనివల్ల అత్యవసర మరమ్మతుల ఖర్చు తగ్గి దీర్ఘకాలంలో సంస్థకు గణనీయమైన ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది. ఇవి చాలా తేలికగా ఉండటం వల్ల గ్రామీణ ప్రాంతాలు, ఇరుకైన వీధులు, కొండ ప్రాంతాలకు సైతం సులభంగా తీసుకెళ్లి ఆపరేట్ చేయవచ్చు.

**బ్యాటరీ వర్సెస్ పెట్రోల్.. పర్యావరణానికి వరం**

సాంప్రదాయ పెట్రోల్ పరికరాలతో పోలిస్తే ఈ బ్యాటరీ పరికరాలు పర్యావరణానికి ఎంతో మేలు చేస్తున్నాయి. పెట్రోల్ యంత్రాల్లో పొగ, వాయు కాలుష్యం, అధిక శబ్దం, విపరీతమైన వైబ్రేషన్లు ఉంటాయి. అంతేకాకుండా వాటిని ప్రారంభించడానికి కష్టమైన 'పుల్‌స్టార్ట్' అవసరమవడమే కాక, నిరంతరం ఇంధన వ్యయం, కార్బ్యురేటర్ మెయింటెనెన్స్ ఖర్చులు ఉంటాయి. అదే బ్యాటరీ పరికరాలకైతే ఇంధన ఖర్చే లేదు. కేవలం ఒక్క బటన్ నొక్కగానే వెంటనే ప్రారంభమవుతాయి. తక్కువ శబ్దం, కాలుష్య రహితం, తక్కువ వైబ్రేషన్స్ వల్ల క్షేత్రస్థాయి సిబ్బందికి అలసట తగ్గుతుంది. ఇది హరిత తెలంగాణ, హరిత భారత లక్ష్యాలకు ఎంతగానో తోడ్పడుతోంది. దేశంలో పర్యావరణహిత ప్రొఫెషనల్ బ్యాటరీ పరికరాలను విస్తృత స్థాయిలో స్వీకరిస్తున్న తొలి విద్యుత్ పంపిణీ సంస్థలలో టీజీఎస్పీడీసీఎల్ ఒకటిగా నిలిచింది.

**మూడు వర్గాలకు ప్రయోజనాలు..**

వినియోగదారులకు.. విద్యుత్ అంతరాయాల వ్యవధి తగ్గుతుంది. వర్షాకాలంలో అత్యవసర సేవలు వేగంగా అందుతాయి. నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా వల్ల ప్రజల్లో సంస్థపై విశ్వాసం పెరుగుతుంది.

సిబ్బందికి.. పుల్‌స్టార్ట్ మరియు పెట్రోల్, ఆయిల్ మిశ్రమాల తలనొప్పులు ఉండవు. శారీరక శ్రమ, అలసట తగ్గి పని సామర్థ్యం, ఉత్పాదకత పెరుగుతుంది. ప్రమాదాల బారి నుండి రక్షణ లభిస్తోంది. టీజీఎస్పీడీసీఎల్‌కు.. ఇంధన, ఆపరేటింగ్ వ్యయాలు గణనీయంగా తగ్గుతాయి. క్షేత్రస్థాయి ఆపరేషన్ల సమర్థత పెరిగి, విలువైన పరికరాలు కాలిపోకుండా రక్షించబడతాయి. ఈ వినూత్న ప్రదర్శన కార్యక్రమంలో బంజారాహిల్స్ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఆపరేషన్స్) శ్రీనివాస్ రెడ్డి, డివిజనల్ ఇంజనీర్ హనుమంతరెడ్డి, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు రమేష్, మల్లేశం, గోపి, అసిస్టెంట్ ఇంజనీర్లు అంజనేయులు, వెంకటేశ్వర్లు, బ్యాటరీ సంస్థ ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.




# హస్మత్‌పేటలో పేదల ఇళ్లు కూల్చలేదు

**హైదరాబాద్, జూన్ 30:**

హస్మత్‌పేటలో హైడ్రా చేపట్టిన చర్యలపై నిరుపేదల ఇళ్లను కూల్చివేశారంటూ జరుగుతున్న ప్రచారాన్ని అధికారులు ఖండించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ఉద్దేశంతోనే తప్పుడు ప్రచారం జరుగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని కాపాడేందుకు చట్టబద్ధంగా చేపట్టిన చర్యలను వక్రీకరించడం సరికాదని స్పష్టం చేశారు.

**కొత్త ఆక్రమణలపైనే చర్యలు**

హస్మత్‌పేట సర్వే నంబర్ 1లో మొత్తం 108 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, దశాబ్దాలుగా జరిగిన ఆక్రమణలతో ఇప్పటికే 98 ఎకరాలు కబ్జాకు గురయ్యాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం మిగిలిన 10 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించేందుకు మాత్రమే చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఇప్పటికే నివాసం ఉంటున్న శాశ్వత ఇళ్లను ఎక్కడా కూల్చలేదని స్పష్టం చేశారు. జీవో 58, 59 కింద క్రమబద్ధీకరించిన ఇళ్లను తొలగించారనే ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని పేర్కొన్నారు.

**ప్రజా ఆస్తి పరిరక్షణే లక్ష్యం**

రెవెన్యూ శాఖ అధికారుల లిఖితపూర్వక విజ్ఞప్తి మేరకే వారి సమక్షంలో పోలీసు బందోబస్తుతో ఈ చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రభుత్వ భూమిలో కొత్తగా నిర్మించిన ప్రీకాస్ట్ గోడలు, తాత్కాలిక షెడ్లు, అక్రమ కంచెలు, ప్లాట్లుగా విభజించేందుకు చేసిన ఏర్పాట్లను మాత్రమే తొలగించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం రక్షించిన 10 ఎకరాల ప్రభుత్వ భూమి విలువ సుమారు రూ.750 కోట్లుగా అంచనా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ భూమిని కాపాడడం వల్ల భవిష్యత్తులో పాఠశాలలు, ఆసుపత్రులు, పార్కులు, రహదారులు వంటి ప్రజా అవసరాల కోసం వినియోగించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తి కాబట్టి వాటిని పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.

# వీరభద్రస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో చండీహోమం

- పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు
- వేదమంత్రాల నడుమ ఆధ్యాత్మిక వేడుకలు

**గుమ్మడిదల, జూన్ 29 (సిరి న్యూస్):**

పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం చండీహోమ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని హోమగుండంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ చండీహోమం నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అనుగ్రహాన్ని పొందేందుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**చండీహోమం విశిష్టత**

హిందూ ఆగమ, శాక్త సంప్రదాయాల్లో చండీహోమానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. జగజ్జనని ఆదిపరాశక్తి అయిన శ్రీ చండీదేవిని ప్రసన్నం చేసుకునేందుకు ఈ హోమాన్ని నిర్వహిస్తారు. దేవీ మహాత్మ్యం పారాయణంతో కూడిన ఈ హోమం ద్వారా దుర్గాదేవి అనుగ్రహం లభిస్తుందని, దుష్టశక్తుల నివారణ, గ్రహదోషాల శాంతి, శత్రు బాధల తొలగింపు, కుటుంబ శాంతి, ఐశ్వర్యాభివృద్ధి, ఆయురారోగ్యాలు, సంతాన సౌభాగ్యం కలుగుతాయని పండితులు తెలిపారు. భక్తి, శ్రద్ధలతో చండీహోమంలో పాల్గొన్న వారికి మానసిక ప్రశాంతతతో పాటు ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందుతుందని పేర్కొన్నారు. హోమ కార్యక్రమం అనంతరం పూర్ణాహుతి నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. వేదఘోషలు, దేవీ నామస్మరణ, మంగళవాయిద్యాల మధ్య ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.



ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి రామ బ్రహ్మ చారి మాట్లాడుతూ ప్రతి పౌర్ణమి సందర్భంగా చండీహోమంను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక పూజలు, హోమాల్లో పాల్గొనాలనుకునే భక్తులు ఆలయ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, రవి నాగేందర్ గౌడ్, ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ధర్మకర్తలు అశోక్ గౌడ్, గుమ్మడిదల మున్సిపల్ కౌన్సిలర్ నరేందర్ రెడ్డి , బొంతపల్లి మాజీ వార్డు సభ్యులు రాంప్రసాద్ దంపతులు, ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో పల్స్ పోలియో కార్యక్రమం

- చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు.

**రామాయంపేట, జూన్ 29 (సిరి న్యూస్)**

రామాయంపేట పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (CHC) హాస్పిటల్‌లో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు స్వయంగా పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (DMHO), హాస్పిటల్ సూపరింటెండెంట్ మరియు DCHS డా. శివదయాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ, "5 ఏళ్ల లోపు ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేసుకోకుండా మిగిలిపోకూడదన్నారు .పిల్లల ఆరోగ్యం కోసం తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని, వైద్యుడిగా నాకు పోలియో ప్రమాదం తెలుసు. మెదక్ నియోజకవర్గాన్ని పోలియో రహిత నియోజకవర్గంగా



తీర్చిదిద్దుదాం" అని పిలుపునిచ్చారు.డిఎంహెచ్ఓ మాట్లాడుతూ రామాయంపేట మండలంలో ఇంటింటి సర్వే ద్వారా అందరు చిన్నారులకు చుక్కలు వేస్తున్నామని, బస్టాండ్, ప్రధాన కూడళ్లలో ప్రత్యేక బూత్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు.ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు స్వయంగా చిన్నారులకు చుక్కలు వేయడంతో తల్లిదండ్రుల్లో ఉత్సాహం నెలకొందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు పల్స్ పోలియోపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా, వైస్ చైర్‌పర్సన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్లు, పుట్టి సందీప్, దేవుని రంజిత్, డాకి శ్యామల, బైరం స్వప్న, కోఆప్షన్ సభ్యులు దేమే యాదగిరి,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సరాపు యాదగిరి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు మానేగళ్ళ రామకృష్ణయ్య, ఆర్ వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ వెంకూ గారి ఉమా సంజీవరెడ్డి, కాట్రియాల సర్పంచ్ కొత్త స్రవంతి రాజేందర్ గుప్తా, తోని గండ్ల సర్పంచ్ శివకుమారి నాగులు, రాయిలాపూర్ సర్పంచ్ గట్టు సుశీల, ప్రగతి ధర్మారం సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, పర్వతాపూర్ సర్పంచ్ తార్య నాయక్, కిషన్ తండ సర్పంచ్ రాణి, జమ్ముల తాండ సర్పంచ్ బన్సీ నాయక్, సుతార్ పల్లి సర్పంచ్ మద్దూరి సునీల్, శివాయిపల్లి సర్పంచ్ మమత,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారిమహేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతల యాదగిరి, రమేష్ రెడ్డి, చింతల స్వామి, ప్రకాష్,కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బూత్ బలమే కాంగ్రెస్ బలం..

- బూత్ బలోపేతంపై మంత్రి వివేక్ ఫోకస్..
- ఓటరు జాబితాపై నిరంతర నిఘా..
- బీఎల్ఏ-2 వ్యవస్థ మరింత పటిష్ఠం..
- కాంగ్రెస్ విజయమే లక్ష్యం: కార్యకర్తలకు పిలుపు..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్ జూన్ 29 (సిరి న్యూస్)**

రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి వ్యవస్థను మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారించింది. ఈ క్రమంలో మందమర్రిలో నిర్వహించిన బీఎల్ఏ-2 సమీక్ష సమావేశంలో రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం





చేశారు. మందమర్రి పట్టణంలోని బి-1 కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, బీఎల్ఏ-2 ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి బూత్ స్థాయిలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయడం, బీఎల్ఏ-2 వ్యవస్థను సమర్థంగా నిర్వహించడం, ఓటరు జాబితాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించడం, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంపై సమీక్ష నిర్వహించారు. ప్రతి బూత్‌లో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తూ కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. బూత్ స్థాయిలో బలమైన వ్యవస్థే పార్టీ విజయానికి పునాది అని ఆయన స్పష్టం చేశారు.

# ప్రతి అర్హుడికీ ఓటు..అదే లక్ష్యం..

- అర్హులందరికీ ఓటు హక్కే లక్ష్యం..
- ఇంటింటా ఓటరు జాబితా పరిశీలన..
- పారదర్శక జాబితాపై ఎమ్మెల్యే ఆదేశాలు..
- బూత్ బలోపేతంపై కాంగ్రెస్ దృష్టి..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్ జూన్ 29 (సిరి న్యూస్)**

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ లక్ష్యమని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి తెలిపారు. ఎన్నికల జాబితా పారదర్శకంగా, తప్పులులేకుండా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం బెల్లంపల్లి మున్సిపాలిటీ 31, 33 వార్డుల్లో జరుగుతున్న ప్రత్యేక





ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. బూత్ స్థాయి ప్రతినిధులు, బూత్ స్థాయి అధికారులతో కలిసి ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను సమీక్షించి పలు సూచనలు చేశారు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు కావాలని, ఒక్క అర్హుడూ మిగిలిపోకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రజలు అవసరమైన పత్రాలు సమర్పించి ఈ ప్రక్రియకు సహకరించాలని కోరారు. ప్రతి బూత్‌లో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దావ స్వాతి రమేష్ బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ రత్నం సుకుమారి, పట్టణ అధ్యక్షుడు బండి ప్రభాకర్, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, బూత్ స్థాయి ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏరువాక పౌర్ణమి వేడుకల్లో ఎడ్ల బండ్ల సందడి

**మునిపల్లి, జూన్ 29 (సిరి న్యూస్):**

మునిపల్లి మండలంలోని కంకోల్ గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. రైతులు తమ ఎడ్లను అందంగా అలంకరించి ఎడ్ల బండ్లతో గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ముందుగా హనుమాన్ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి ఆలయం చుట్టూ ఎడ్ల బండ్లను ప్రదక్షిణ చేశారు. అనంతరం ఊరి చివరనున్న పోచమ్మ ఆలయానికి చేరుకుని ఆలయం చుట్టూ ఎడ్ల బండ్లను తిప్పారు.డప్పు, సప్పుల మోతలు, సంప్రదాయ వాయిద్యాల నడుమ గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. రైతులు, యువకులు, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని ఆనందోత్సాహాల మధ్య ఏరువాక పౌర్ణమి వేడుకలను జరుపుకున్నారు.



## ఏడుపాయల దేవాలయం వద్ద 12 కాటేజీల నిర్మాణానికి రూ. 7 కోట్లు మంజూరు

- ఉత్తర్వులు జారీ చేసిన టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్




**పాపన్నపేట జూన్ 29 సిరి న్యూస్ :**



ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ఏడుపాయల వన దుర్గాభవాని మాత అమ్మవారి సన్నిధిలో 12 కాటేజీల నిర్మాణానికి రూ.7 కోట్ల రూపాయలను మంజూరు చేస్తూ తెలంగాణ టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్ జీవో ఆర్టి నెంబర్ 193 తేదీ 29.06.2026 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి శాఖ అవసరాలు ఎకో ఫ్రెండ్లీ ద్వార 12 కాటేజీలను ఏడుపాయలలో నిర్మించడానికి నిధులను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాల్సిందిగా టూరిజం శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ను ఆదేశించారు.

## అర్ధరాత్రి దొంగల బీభత్సం





**వెల్దుర్తి, జూన్ 29, ( సిరి న్యూస్ ):**

ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు వెల్దుర్తి మండలం అరేగూడం గ్రామానికి చెందిన చాకలి భాగ్య, ఏర్పుల నవీన్ ఇళ్లలో చోరబడి దొంగతనానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో భాగ్య ఇంటి నుంచి రూ.10,000 నగదు, 5 తులాల వెండి, ఒక మాసం బంగారు ముక్కెర,చోరీ చేయగా, నవీన్ ఇంటి నుంచి బంగారు పుస్తె, వెండి కాలకడాలు, చేతి గాజులు, పట్ట గొలుసులు, అపహరించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మునిపల్లికి కొత్త తహసీల్దార్ కార్యాలయ భవనం మంజూరు

**మునిపల్లి, జూన్ 29 (సిరి న్యూస్):**



ఆందోల్ నియోజకవర్గంలోని మునిపల్లి మండల కేంద్రంలో నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2 కోట్ల 25 లక్షలు పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ జి.ఓ.ఆర్.టి. నెం.375, తేదీ 25-06-2026ను ప్రభుత్వంవిడుదల చేసింది.శిథిలావస్థలో ఉన్న, అద్దె భవనాల్లో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణంలో భాగంగా ఈ నిధులు మంజూరయ్యాయి.ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవతో మునిపల్లి తహసీల్దార్ కార్యాలయ భవనానికి నిధులు మంజూరు కావడం పట్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ కుమార్, ఏఎంసీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రామ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బాబు పటేల్,మన్సాన్‌పల్లి సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహేష్, కార్యకర్తలు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రగతి ధర్మారం గ్రామంలో సబ్ సెంటర్ ఏర్పాటు.

**రైతులకు యూరియా పంపిణీ.**

**రామాయంపేట, జూన్ 29 (సిరి న్యూస్)**



రామాయంపేట మండలం లోని ప్రగతి ధర్మారం గ్రామంలో సోమవారం నాడు పిఏసిఎస్ బ్రాంచ్ ఆఫీస్ ద్వారా సబ్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగింది. ధర్మారం గ్రామంలో ఈ సబ్ సెంటర్ ఏర్పాటుకు సహకరించిన సీఈఓ నరసింహులు కు, డి సి ఓ, డి ఏ ఓ ప్రత్యేక కృతజ్ఞతలు గ్రామ ప్రజలు తెలిపారు. సబ్ సెంటర్ ద్వారా స్థానిక సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ ,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాసాయిపేట మల్లేశం ల చేతుల మీదుగా యూరియా పంపిణీ కార్యక్రమం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పిఏసిఎస్ ఆఫీస్ సిబ్బంది కొండల్ రెడ్డి బృందం, స్థానిక కాంగ్రెస్ నాయకులు పోగుల నాంపల్లి, వడ్ల శ్రీశైలం, షాదుల్లా, చాకలి చిన్న నారాయణ, సుతారి యాదగిరి, పెండెల శ్రీనివాస్, దొమ్మాట నాగయ్య, కమ్మరి రాజయ్య తో పాటు చాలామంది గ్రామ ప్రజలు ,రైతులు పాల్గొన్నారు.

# చికిత్సకు సీఎం నిధి అండ..

- పేద కుటుంబానికి రూ.50 వేల వైద్య సాయం..
- ఎమ్మెల్యే సాగరన్న చేతుల మీదుగా ఎల్వోసీ అందజేత..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్ జూన్ 29 (సిరి న్యూస్)**

అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ పేద కుటుంబానికి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అండగా నిలిచారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందించి కుటుంబానికి భరోసా కల్పించారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 57వ డివిజన్‌కు చెందిన బి. రమేష్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.50 వేల విలువైన చికిత్స అనుమతి పత్రాన్ని (ఎల్వోసీ) ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు రమేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా పేదలకు అవసరమైన వైద్య సహాయం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు చికిత్సకు అడ్డంకి కాకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని, అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు..



# మాధవాని కుంటలో హైడ్రా స్వచ్ఛత సేవలు



**జిన్నారం జూన్ 29 సిరి న్యూస్**

బొల్లారం డివిజన్ పరిధిలోని మాధవానికుంట పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం, ప్లాస్టిక్ ,వ్యర్థాలను హైడ్రా సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ ద్వారా పూర్తిగా తొలగించారు.కలుషితం కాకుండా ముందస్తు చర్యలు వర్షాకాలం నేపథ్యంలో చెత్త వల్ల కుంటలోనే నీరు కలుషితం కాకుండా అలాగే మురుగునీరు నిల్వ ఉండి దోమలు ప్రబలకుండా సిబ్బంది ఈ చర్యలు చేపట్టింది. పరిసరాల సుందరీకరణ కుంట గట్టు పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను క్లియర్ చేయడంతో పాటు ఆ ప్రాంతమంతా పరిశుభ్రంగా మారేలా సిబ్బంది శ్రమించారు. స్థానికులకు ఉపశమనం చెత్తవల తీవ్ర దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న కాలనీవాసులకు రాకపోకలు సాగించే ప్రయాణికులకు హైడ్రా క్లీనింగ్ డ్రైవ్ తో పెద్ద ఉపశమనం లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్, సానిటరీ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# మైసయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన ఆవుల రాజి రెడ్డి

**వెల్దుర్తి,జూన్ 29,( సిరి న్యూస్ )**

వెల్దుర్తి మండల కేంద్రంలోని బోయిల గూడెంలో పిడుగుపాటుకు పానుగంటి మైసయ్య అకస్మాత్తుగా మరణించారు ఆ విషయం స్థానిక వెల్దుర్తి మండల కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజు రెడ్డి తక్షణమే వారి పరిస్థితులను దృష్టి పెట్టుకొని తన సొంత నిధుల నుండి 20000 వేల రూపాయలు ఆర్థిక సహాయం కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా అందజేయించారు. ఆపద సమయంలో ఆదుకుంటున్న ఆవుల రాజిరెడ్డిని అన్ని వర్గాల వారు గుర్తు చేసుకుంటున్నారని గ్రామస్తులు ఆశాభవం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహేష్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, శేఖ గౌడ్, ఆంజనేయులు, కృష్ణ గౌడ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# కారును ఢీ కొట్టిన లారీ

**నర్సాపూర్ జూన్ 29 (సిరి న్యూస్)**

నర్సాపూర్ పట్టణంలో కోమటి కుంట సమీపంలో తూప్రాన్- నర్సాపూర్ రోడ్డుపై రాత్రి 8 గంటల సమయంలో కారును లారీ వేగంగా ఢీ కొట్టింది స్థానికుల వివరాల ప్రకారం తూప్రాన్ నుండి బీదర్ కు వెళుతున్న టీ ఎస్ 30 టి 1446 నెంబర్ గల లారీ నర్సాపూర్ పట్టణానికి చెందిన ఒక వ్యక్తి కారును వేగంగా ఢీకొట్టడంతో డివైడర్ పైకి వెళ్ళిపోయింది కారు పూర్తిగా దెబ్బతింది కారులో డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చు కున్నారు లారీ డ్రైవర్ మద్యం



సేవించి ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని డ్రైవర్ ని అదుపులో తీసుకున్నారు

## సంపాదకీయం

# సిగాచి గాయం.. నెరవేరని హామీల శోకం!

పారిశ్రామిక ప్రగతి చాటున కార్మికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నా.. ప్రభుత్వాలు, యాజమాన్యాల తీరు మారడం లేదనడానికి 'సిగాచి ఇండస్ట్రీస్' ఘోరకలి నిలువెత్తు సాక్ష్యం. పాశమైలారం పారిశ్రామికవాడలో 2025 జూన్ 30న సంభవించిన భయంకరమైన స్ప్రే డ్రైయర్ పేలుడు దుర్ఘటన జరిగి నేటికి ఏడాది. ఆనాడు కన్నుమూసిన 54 మంది కార్మికుల కుటుంబాల శోకం ఇప్పటికీ అరణ్యరోదనగానే మిగిలిపోయింది. కాలం గడుస్తున్నా.. గాయాలు మానుతున్నా.. నాడు ఇచ్చిన ప్రభుత్వ, యాజమాన్యాల 'కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా' హామీలు మాత్రం నేటికీ కాగితాలకే పరిమితం కావడం అత్యంత విచారకరం. ప్రమాదం జరిగిన తొలినాళ్లలో అటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇటు సిగాచి యాజమాన్యం మృతుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున పరిహారం అందిస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. కానీ ఏడాది తిరిగేసరికి బాధితులకు అందింది సగటున రూ. 25 లక్షల నుండి రూ. 42 లక్షలు మాత్రమే. దారుణం ఏమిటంటే.. కార్మికులకు చట్టబద్ధంగా రావలసిన ఈఎస్ఐ, ఈపీఎఫ్, గ్రూప్ ఇన్సూరెన్స్ వంటి హక్కుల మొత్తాలను సైతం తామే ఇచ్చిన పరిహారంగా యాజమాన్యం లెక్కల్లో చూపడం కార్మిక లోకాన్ని వంచించడమే. తమ సొంత జేబుల నుండి ఇవ్వాల్సిన పరిహారాన్ని ఎగ్గొట్టి, కార్మికుల రక్తం కూడబెట్టిన చట్టబద్ధ నిధులనే కంపెనీ తన దాతృత్వంగా ప్రదర్శించుకోవడం పారిశ్రామిక వర్గాల నైతిక పతనానికి అద్దం పడుతోంది.

### నివేదికలు తేల్చిన నగ్నసత్యాలు...

టెక్నికల్ ఎక్స్‌పర్ట్ కమిటీ ఇచ్చిన 128 పేజీల సమగ్ర దర్యాప్తు నివేదిక ప్రకారం, ఈ ప్రమాదం ముమ్మాటికీ యాజమాన్య నిర్లక్ష్యపు హత్యే. కేవలం 818 హెచ్‌పీ సామర్థ్యానికి అనుమతులు తీసుకుని ఏకంగా 1,777 హెచ్‌పీతో యంత్రాలను నడపడం ద్వారా కంపెనీ లాభాల వేటలో కార్మికుల ప్రాణాలను పణంగా పెట్టింది. ఫ్యాక్టరీలో కనీస ఫైర్ క్లియరెన్స్ లేదు, అత్యవసర గ్యాస్ నియంత్రణ వ్యవస్థలు లేవు, చివరికి ప్రమాదకర రసాయనాల బోర్డులు కూడా ప్రదర్శించలేదు. ప్లాంట్ భద్రతను పర్యవేక్షించాల్సిన 'సేఫ్టీ ఆఫీసర్'కు కనీస పారిశ్రామిక అర్హతలు కూడా లేవని నివేదిక తేల్చింది. ఇవన్నీ తెలుస్తున్నా.. ఫ్యాక్టరీల తనిఖీ విభాగం ఏళ్ల తరబడి కళ్లు మూసుకుని మమ అనిపించడం పర్యవేక్షణ లోపానికి పరాకాష్ట.

### మిగిలిన బతుకులు.. తీరని ఆవేదన..

కంపెనీ మూతపడటంతో ప్రమాద సమయాన విధుల్లో లేని వందలాది మంది కార్మికులు నేడు రోడ్డున పడ్డారు. వారికి ఎలాంటి లేబర్ చట్టాల ప్రకారం గ్రాట్యుటీ కానీ, లేఆఫ్ అలవెన్స్ కానీ అందలేదు. అటు తీవ్రంగా గాయపడి, శరీరాలు కాలిపోయిన 33 మంది క్షతగాత్రుల పరిస్థితి మరీ దారుణం. వారి వైద్య ఖర్చులను కూడా పరిహారంలోనే మినహాయించుకున్న క్రూర చరిత్ర ఈ యాజమాన్యానిది. కనీసం మరణించిన 8 మంది కార్మికుల శరీర భాగాలు లభించక, డీఎన్ఏ పరీక్షల కోసం నెలల తరబడి నిరీక్షించి, డెత్ సర్టిఫికెట్ల కోసం ఆయా కుటుంబాలు పడిన అవస్థలు వర్ణనాతీతం.



### ఇప్పటికైనా మేల్కొనాలి...

సిగాచి ఉదంతం ఒక్క ఫ్యాక్టరీ సమస్య కాదు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఐదు హై-రిస్క్ ఫ్యాక్టరీలలో ఒకటి చట్టాలను ఉల్లంఘిస్తోందని ప్రభుత్వ సర్వేలే చెబుతున్నాయి. కేవలం పరిశ్రమల స్థాపన, పెట్టుబడుల ఆకర్షణే ధ్యేయం కాకూడదు. శ్రామికుడి ప్రాణానికి రక్షణ కల్పించడమే నిజమైన పారిశ్రామిక ప్రగతి. ఈ మొదటి వర్ధంతి సందర్భంగానైనా ప్రభుత్వం ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించి, ప్రకటించిన రూ. కోటి పూర్తి పరిహారాన్ని బాధితులకు తక్షణమే ఇప్పించాలి. నిబంధనలు ఉల్లంఘించే పరిశ్రమలపై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకున్నప్పుడే, భవిష్యత్తులో పాశమైలారంలో మరో సిగాచి లాంటి ఘోరకలి పునరావృతం కాకుండా అడ్డుకోగలం.

# పార్టీ బలోపేతంలో బీఎల్‌ఏల పాత్ర కీలకం.

- ఓటరు జాబితాపై బీఎల్‌ఏలు అప్రమత్తంగా ఉండాలి.
- ప్రతి బూత్‌లో పార్టీని మరింత బలోపేతం చేయాలి.
- బీఆర్ఎస్ పార్టీ బీఎల్‌ఏలకు ఐడీ కార్డులు అందజేసిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి.

**మెదక్,జూన్,29(సిరి న్యూస్)**

బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో బీఎల్‌ఏల పాత్ర ఎంతో కీలకమని,ఓటరు జాబితాపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి, అర్హులైన ప్రతి ఓటరు పేరు నమోదు అయ్యేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని మాజీ డిప్యూటీ స్పీకర్, టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం.పద్మ దేవేందర్ రెడ్డి బిఎల్ఏలకు సూచించారు.



సోమవారం మెదక్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మెదక్ పట్టణానికి చెందిన బీఎల్ఏలకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా అత్యంత కీలకమైందని, దానిని ఎప్పటికప్పుడు పరిశీలించి లోపాలు లేకుండా చూడాల్సిన బాధ్యత బీఎల్‌ఏలపై ఉందన్నారు.ఎన్నికల సంఘం చేపట్టే ప్రతి కార్యక్రమంపై పూర్తి అవగాహనతో పనిచేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా,అనర్హుల పేర్లు తొలగించేలా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పార్టీ దృష్టికి తీసుకెళ్లాలని, పార్టీ కార్యక్రమాలను ఇంటింటికీ చేరవేయడంలో సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.పార్టీ కార్యకర్తలు,నాయకుల మధ్య సమన్వయంతో పనిచేస్తే సంస్థాగతంగా పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు.రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి బూత్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని,ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వొద్దని సూచించారు. ప్రతి బీఎల్ఏ తనకు కేటాయించిన బూత్‌లో నిరంతరం ప్రజలతో మమేకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మెదక్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అకిరెడ్డి.కృష్ణారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు,కౌన్సిలర్లు జుబెర్ అహ్మద్,బట్టి ఉదయ్, మ్యాదరి. దీపక్ కుమార్,మాజీ కౌన్సిలర్లు మాయ మల్లేశం,బీమరి కిషోర్, పార్టీ బిఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.

# ఏరువాక పౌర్ణమి సందర్భంగా శ్రీ గురు పీఠంలో ప్రత్యేక పూజలు...

- శ్రీ గురు పీఠం ఫౌండర్ అండ్ చైర్మన్ హైకోర్టు సీనియర్ న్యాయవాది పెద్దగోని జిన్నారం శివకుమార్ గౌడ్ !!

**శివంపేట్ జూన్ 29 (సిరి న్యూస్ )**

శివంపేట మండలం గూడూరు గ్రామంలోని శ్రీ గురు పీఠం లోని దత్తాత్రేయ మహా స్వామి పంచాయతనం దేవాలయం, పంచవటి, శ్రీ షిరిడి సాయినాథ దేవాలయంలో ఈరోజు ఏరువాక పూర్ణిమ సందర్భంగా శ్రీ దత్తాత్రేయ మహాస్వామి పంచాయతనంలో అభిషేకం అర్చన శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో కాకడ హారతి మధ్యాహ్నం హారతి ఇవ్వడం జరిగినది. శ్రీ గురు పీఠం ప్రాంగణంలో పారిజాత వృక్షాలను నాటారు. శాస్త్రుల నటరాజ్ శర్మ మరియు శాస్త్రుల శ్రీ హర్ష ఆధ్వర్యంలో పూజాక్రతువులు జరిగాయి. శ్రీ సాయి మధ్యాహ్న హారతి తదనంతరం పద్మా రావు వెంకటలక్ష్మి దంపతులు భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంలో శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పెద్దగొని శివ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో అర్చకులు మెదక్ జిల్లా గ్రంధాల సంస్థ చైర్మన్ సువాసి రెడ్డి , శివంపేట్ పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి , పద్మా రావు వెంకట్ లక్ష్మి దంపతులను శ్రీ షిరిడి సాయిబాబా శాలువతో సత్కరించారు. ట్రస్ట్ సభ్యులు పద్మారావు వెంకట్ లక్ష్మి దంపతులను ఆశీర్వదిస్తూ ఆ దత్తాత్రేయ స్వామి గురుపరంపర శిరిడి సాయి నాధుల ఆశీస్సులు వారికి ఎల్లవేళలా లభించాలని వారు వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆశీర్వదించారు ఈ కార్యక్రమానికి పిఎసిఎస్ సీఈవో మధు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, గుడూరు గ్రామ



పంచాయతీ సర్పంచ్ బేగరి నర్సయ్య, తాజా మాజీ సర్పంచ్ స్వరాజ్యలక్ష్మి శ్రీనివాస్ గౌడ్, కొత్తపేట యాదగిరి, భాస్కర్ గుప్తా, శ్రీ గురు పీఠం సమన్వయకర్త కొంతాన్ పల్లి సత్యనారాయణ గౌడ్, రాజేందర్ రెడ్డి, విశ్వ శ్రీ లా చాంబర్స్, నాగేంద్ర, కొండల్, అర్జున్, బల్కంపేట నాగరాజ్, బల్కంపేట కిరణ్ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# మైనార్టీల అభ్యున్నతే లక్ష్యం

- జిల్లా అభివృద్ధికి సమిష్టి కృషి
- మెదక్ జిల్లా కాంగ్రెస్ మైనార్టీ చైర్మన్ ఎం.డి. సూఫీ జానీ
- జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మైనార్టీ చైర్మన్

**మెదక్, జూన్ 29 (సిరి న్యూస్)**

మైనార్టీల అభ్యున్నతే తమ లక్ష్యమని, జిల్లా అభివృద్ధికి సమిష్టి కృషిచేద్దామని మెదక్ జిల్లా కాంగ్రెస్ మైనార్టీ చైర్మన్ ఎం.డి. సూఫీ జానీ తెలిపారు. నూతనంగా మెదక్ జిల్లా కాంగ్రెస్ మైనార్టీ చైర్మన్‌గా నియమితులైన ఎం.డి. సూఫీ జానీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు సోమవారం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ భేటీ సందర్భంగా జిల్లా అభివృద్ధి, మైనార్టీల సంక్షేమం, ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, విద్యాభివృద్ధి తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.అనంతరం మెదక్ జిల్లా కాంగ్రెస్ మైనార్టీ చైర్మన్ ఎం.డి. సూఫీ జానీ మాట్లాడుతూ మైనార్టీల అభ్యున్నతికి ప్రత్యేక ప్రణాళికలు అవసరమన్నారు.జిల్లాలోని మైనార్టీ వర్గాల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.ముఖ్యంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, స్వయం ఉపాధి అవకాశాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.మైనార్టీ వర్గాలకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.జిల్లా సమగ్ర అభివృద్ధిలో మైనార్టీల పాత్ర కీలకమని, సమాజంలోని అన్ని వర్గాలు అభివృద్ధి చెందితేనే నిజమైన పురోగతి సాధ్యమవుతుందని ఎం.డి. సూఫీ జానీ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం చేపడుతున్న



అభివృద్ధి కార్యక్రమాలకు మైనార్టీ వర్గాలు పూర్తి సహకారం అందిస్తాయని తెలిపారు.నేటి పోటీ ప్రపంచంలో యువత విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ మహమ్మద్ అమీరుద్దీన్, మాజీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్యాంసుందర్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ ఆదిల్ పాషా, షేక్ అక్బరుద్దీన్, షేక్ ఫస్యుద్దీన్, షేక్ ఖాజా, ఎజాజ్, షానవాజ్, నదీమ్, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

# జనబలం.. రమేష్ ఏకగ్రీవం

## రమేష్ కే పట్టం గోల్డెన్ ఫామ్స్ లో సరికొత్త చరిత్ర!

**అమీన్ పూర్ జూన్ 29 సిరి న్యూస్**



అమీన్ పూర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలో జరిగిన గోల్డెన్ ఫామ్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ ఎన్నికల్లో ఎం. రమేష్ కుమార్ నాయకత్వానికి అసోసియేషన్ సభ్యులంతా ముక్తకంఠంతో మద్దతు పలికారు. ఈ పోటీలో ఎవరు నిలబడకపోవడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి వైపు అడుగులు గోల్డెన్ ఫామ్స్ ఓనర్స్ అసోసియేషన్స్ మరిన్ని నిధులు సాధించి మౌలిక వసతుల కల్పనతో ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతామని ఆయన తెలిపారు. కృతజ్ఞతలు తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు ఆయన తెలిపారు. అందరినీ కలుపుకుంటూ అసోసియేషన్ అభివృద్ధికి శ్రమిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఎన్నికైన కమిటీ సభ్యులు, అనిత, శ్రీరామ్ దివాకర్, నాగేంద్ర, కిషోర్,సుష్మిత, సత్య, గౌరీ రాజేష్, తృప్తి నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# పుష్ప నగేష్‌ను కలిసిన పాస్టర్ ఫెలోషిప్ కమిటీ



**రామచంద్రపురం, జూన్ 29 (సిరి న్యూస్):**

పటాన్చెరు నియోజకవర్గ పాస్టర్ ఫెలోషిప్ నూతన కమిటీ సభ్యులు సోమవారం రామచంద్రపురం డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.రామచంద్రారెడ్డి నగర్ కాలనీలో గల ఆమె గృహంలో జరిగిన సమావేశంలో పాస్టర్ ఫెలోషిప్ నూతన అధ్యక్షుడు సుందర్ రాజ్ కార్యవర్గ సభ్యులను పరిచయం చేశారు. అనంతరం పుష్ప నగేష్ నూతన కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్ల సంక్షేమంతో పాటు క్రైస్తవ సమాజ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తూ సేవా కార్యక్రమాల్లో ముందుండాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పాస్టర్ ఫెలోషిప్ నూతన కమిటీ సభ్యులు పుష్ప నగేష్ దంపతులను శాలువాలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాస్టర్ ఫెలోషిప్ జనరల్ సెక్రటరీ అమృత్ రావు, ట్రెజరర్ జైరాజ్‌తో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు

# బీడీఎల్ కాలనీలో ప్రజా సమస్యలపై ఆదర్శ్ రెడ్డి క్షేత్రస్థాయి పరిశీలన



**రామచంద్రపురం, జూన్ 29 (సిరి న్యూస్):**

పటాన్‌చెరు నియోజకవర్గంలోని భారతి నగర్ డివిజన్ పరిధిలోని బీడీఎల్ కాలనీలో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మాజీ కార్పొరేటర్ సింధు తో కలిసి కాలనీలో పర్యటించిన ఆయన స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్, ఇంజినీరింగ్ ఏఈ శివతో కలిసి బీడీఎల్ కాలనీ నుంచి రాయసంద్రం చెరువు వరకు ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. రాత్రి వేళల్లో కొందరు మద్యం సేవించి కాలనీలోకి వచ్చి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ మహిళలు, స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని నివాసితులు వారి దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై స్పందించిన ఆదర్శ్ రెడ్డి, ముఖ్యంగా వారాంతాల్లో పోలీసు శాఖ ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిస్థాయిలో అరికట్టాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్‌ను కోరారు. అలాగే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత ప్రాంతంలో కంపౌండ్ వాల్ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ ఏఈ శివకు సూచించారు.ఈ కార్యక్రమంలో బీడీఎల్ కాలనీ సొసైటీ డైరెక్టర్లు రమేష్, విఠల్ రెడ్డి, పాషా, మహిళలు, స్థానిక నివాసితులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సహకార వారోత్సవాల్లో భాగంగా సహకార జెండా ఆవిష్కరణ

**రామచంద్రపురం, జూన్ 29 (సిరి న్యూస్):**



"సహకారంతో సమృద్ధి వైపు – ఐదవ స్వర్ణ సంవత్సరం" కార్యక్రమంలో భాగంగా సోమవారం తెల్లాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కార్యాలయంలో సహకార జెండాను ఆవిష్కరించారు.సహకార రంగాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న సహకార వారోత్సవాల్లో భాగంగా సంఘం చైర్మన్ మల్లెపల్లి బుచ్చిరెడ్డి జెండాను ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సహకార సంఘాల బలోపేతం, రైతుల సంక్షేమానికి సహకార వ్యవస్థ కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం డైరెక్టర్ నింగదళ సునీల్, రైతులు లక్డారం మల్లేష్, మనోహర్ సింగ్, కోటి సత్యనారాయణ, కృష్ణరాజు, బుచ్చి రాములు తదితరులు పాల్గొన్నారు

# గ్రామాభివృద్ధికి పాలకవర్గం పట్టుదలతో పనిచేయాలి

- **ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
- **మంబాపూర్‌లో రూ.10 లక్షల ఎమ్మెల్యే నిధులతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన**

**గుమ్మడిదల, జూన్ 29( సిరి న్యూస్):**



గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, పంచాయతీ పాలకవర్గాలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండల పరిధిలోని మంబాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే నిధుల నుంచి మంజూరైన రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు కొండకొల్ల ఇంటి నుంచి చింతచెట్టు వరకు, అలాగే కమ్మరోళ్ల ఇంటి నుంచి ఈత చెట్టు వరకు నిర్మించనున్నారు. ఈ రహదారి నిర్మాణంతో గ్రామ ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగాలంటే పంచాయతీ పాలకవర్గాలు ప్రజల అవసరాలను గుర్తించి చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. గ్రామ ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పాలకవర్గం సేవలు అందించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ప్రజల సహకారంతోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొత్తకొండ భాస్కర్, ఉపసర్పంచ్ కమ్మరి ప్రవీణఅశోక్ చారి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు సంపంగి మౌనిక రవి, ఇస్తారు భాస్కర్, కొండను విజయ్, మల్లపల్లి యాదమ్మ, శ్రీశైలం, రాజు గౌడ్, కొండ నీలావతి, ఆగేష్, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు ప్రకాశ్, మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజం

**వెల్దుర్తి,జూన్ 29,(సిరి న్యూస్):**

పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెల్దుర్తి నందు సోమవారం దేవరాజ్ పద్మజ ఉద్యోగ విరమణ సభ అత్యంత ఘనంగా, ఆత్మీయ వాతావరణంలో నిర్వహించబడింది. సుదీర్ఘకాలం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, క్రమశిక్షణ, సేవాభావం, విలువలతో కూడిన విద్యాబోధన ద్వారా ఎందరో విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిన దేవరాజ్ పద్మజ ను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యాధికారి బుచ్చ నాయక్ మాట్లాడుతూ, ఉపాధ్యాయురాలు పద్మజ అందించిన విద్యాసేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆమె తన ఉద్యోగ జీవితంలో చూపిన అంకితభావం, క్రమశిక్షణ, విద్యార్థుల పట్ల చూపిన ప్రేమ ప్రతి ఉపాధ్యాయునికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పద్మజ సేవలను స్మరించుకుంటూ, ఆమె భవిష్యత్తు జీవితం ఆరోగ్యంగా, ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు.ఈ సభలో గ్రామ సర్పంచ్ ఆదర్శ్, ఉపసర్పంచ్ శ్రవణ్, ఉపాధ్యాయ బృందం, వివిధ సంఘాల నాయకులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు, పలువురు ప్రముఖులు, పాల్గొని ఉపాధ్యాయురాలు పద్మజ కు ఘనంగా సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ



కార్యక్రమంలో భాగంగా పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి ప్రధానోపాధ్యాయులు సాంబయ్య ఉపాధ్యాయ బృందం ఘనంగా శాలువతో పాటు సన్మాన పత్రము, బహుమతులతో సత్కరించడం జరిగింది.

# బొంతపల్లి శ్రీ సాయిబాబా అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో సంతాప సభ

- **డాక్టర్ బ్రహ్మశ్రీ చంద్రమౌళి గురుస్వామికి ఘనంగా శ్రద్ధాంజలి**

**గుమ్మడిదల, జూన్ 29 (సిరి న్యూస్):**

డాక్టర్ బ్రహ్మశ్రీ చంద్రమౌళి గురుస్వామి శివైక్యం పొందిన సందర్భంగా బొంతపల్లిలోని శ్రీ సాయిబాబా అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గురుస్వాములు మాట్లాడుతూ బొంతపల్లి అయ్యప్ప ఆలయ నిర్మాణానికి డాక్టర్ బ్రహ్మశ్రీ చంద్రమౌళి గురుస్వామి విశేష సేవలందించారని కొనియాడారు. అయ్యప్ప భక్తిలో వేలాది మంది



భక్తులకు మాలధారణ చేయించి ఆధ్యాత్మిక మార్గంలో నడిపించిన మహనీయుడిగా ఆయనను స్మరించుకున్నారు. గురుస్వామి లేని లోటు ఎప్పటికీ పూడ్చలేనిదని భావోద్వేగంతో నివాళులర్పించారు. గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః అనే గురుతత్వాన్ని ప్రతి అయ్యప్ప భక్తుడికి ఆచరణలో చూపించిన ఆదర్శ గురుస్వామి అని పేర్కొన్నారు. ఉత్తర నక్షత్రం రోజున ఆయన శివైక్యం చెందడం దైవ సంకల్పమేనని, సాక్షాత్తు శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి చరణాల్లో ఆయన ఆత్మ విలీనమైందని భక్తులు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బారాది నాగభూషణం గురుస్వామి, సురభి నాగేందర్ గౌడ్ గురుస్వామి, ఆలేటి శ్రీనివాస్ రెడ్డి గురుస్వామి, నర్సింగ్ రావు గురుస్వామి, రాఘవేంద్ర గురుస్వామి, బొంతపల్లి అయ్యప్ప ఆలయ పూజారి మల్లికార్జున్, సాయిబాబా ఆలయ పూజారి గిరీష్ పంతులుతో పాటు శిష్యబృందం, అయ్యప్ప భక్తులు పాల్గొని గురుస్వామి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

# నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యుత్ శాఖ ఏఈ పై చర్యలు తీసుకోవాలి


- **సిద్దిపేట కలెక్టరేట్ ప్రజావాణిలో వినతిపత్రం సమర్పణ**

**గజ్వేల్, జూన్ 29 (సిరి న్యూస్):**

జగదేవపూర్ మండలంలో పలు సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యుత్ శాఖ ఏఈపై చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. అలాగే కలెక్టర్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ప్రొసీడింగ్స్ వెంటనే ఇవ్వాలని కోరారు.సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తిమ్మాపూర్ సర్పంచ్ పోసాన్‌పల్లి రాజు, వట్టిపల్లి ఉపసర్పంచ్ బోనకొల్లూరు నాగరాజు, వార్డు సభ్యుడు కొలనుపాక రాములు కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ—— ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన పేదల పేర్లు ఎల్–3 జాబితాలోకి వెళ్లడం వల్ల వారికి ఇళ్లు అందడం లేదని తెలిపారు. ఈ విషయంపై ఎంపీడీవో, జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు దరఖాస్తులు ఇచ్చినా, ఇప్పటివరకు జస్టిఫికేషన్ రిపోర్ట్ నమోదు చేసి ప్రొసీడింగ్స్ జారీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.అదే విధంగా జగదేవపూర్ మండలంలో విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉన్నప్పటికీ సంబంధిత ఏఈ వాటిని పట్టించు



కోవడం లేదని ఆరోపించారు. తిమ్మాపూర్ గ్రామంలో ఇండ్ల పైగా వెళ్లే త్రీఫేజ్ లైన్ల కారణంగా కరెంట్ షాక్




ప్రమాదాలు చోటుచేసుకున్నాయని తెలిపారు. రోడ్డు పక్కన ఉన్న కరెంటు స్తంభం తీగలపై ఆధారపడి ప్రమాదకర స్థితిలో ఉందని, అది సమీపంలోని డీటీఆర్‌పై పడితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.ఈ సమస్యలను గత మూడు నెలలుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. వట్టిపల్లి గ్రామంలో ఇండ్లపైగా వెళ్లే సింగిల్ ఫేజ్ లైన్ తొలగించాలని పలుమార్లు కోరినా స్పందన లేకపోవడం బాధాకరమన్నారు.ఏఈ గ్రామాలను సందర్శించి సమస్యలను గుర్తించకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొంటూ, ఆయనను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో దుబాసి సుధాకర్, కె. సురేష్, పైసా స్వామి, గుండ్రు స్వామి తదితరులు పాల్గొన్నారు.

# 13 ఏళ్ల తర్వాత జోగిపేట చేనేత సొసైటీ ఎన్నికలు

- **10వ తేదిన ఎన్నికలు**
- **జూలై 2,3,4 తేదీల్లో నుంచి నామినేషన్‌లు**
- **షెడ్యూలు విడుదల చేసిన చేనేత జౌళిశాఖ అధికారి విజారత్ అలీ**

**జోగిపేట, జూన్ 29, (సిరి న్యూస్):**

13 సంవత్సరాల తర్వాత చేనేత సహకార సంఘాలకు ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వచ్చే నెల 10వ తేదీన జోగిపేట చేనేత సంఘానికి పోలింగ్ నిర్వహించేందుకు షెడ్యూలును చేనేత జౌళిశాఖ అధికారి విజారత్ అలీ విడుదల చేసారు. సోమవారం జోగిపేటలోని చేనేత సహకార సంఘం కార్యాలయంలో తాజా మాజీ చైర్మన్, కార్మికుల సమక్షంలో జిల్లా సొసైటీ కార్యాలయ అధికారి విజారత్ అలీ నోటిఫికేషన్ పత్రాన్ని నోటీస్ బోర్డులో ఉంచారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. జోగిపేట చేనేత సహకార సంఘంలో 64 గ్రామాల్లో సభ్యత్వం కలిగిన ఓటర్లు 703 మంది ఉన్నారని తెలిపారు. ఈ సంఘానికి 9 మంది డైరెక్టర్‌లు కాగా, మహిళలకు 2 స్థానాలు, 7 స్థానాలను జనరల్‌గా కేటాయించడం జరిగిందన్నారు. డైరెక్టర్‌లుగా గెలుపొందిన వారిలో నుంచి ఒక్కరిని చైర్మన్‌గా ఎన్నికవుతారని ఆయన తెలిపారు. ఈ సొసైటీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న అభ్యర్థులు జోగిపేట చేనేత సహకార సంఘం కార్యాలయంలో వచ్చే నెల 2వ తేదీన నామినేషన్ పత్రాలను అందజేయడం జరుగుతుందని తెలిపారు. జూలై 3, 4వ తేదీలలో అభ్యర్థుల నామినేషన్‌ల స్వీకరణ, 5న



నామినేషన్ పత్రాల పరిశీలన, 6న నామినేషన్‌ల ఉపసంహరణ ఉంటుందన్నారు. జూలై 10వ తేదీన ఉదయం 9 గంటలకు పోలింగ్ ప్రారంభమై, మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందని, ఆదే రోజున సాయంత్రం ఫలితాలను వెల్లడించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆయన వెంట తాజా మాజీ చైర్మన్ వర్కల అశోక్‌తో పాటు కార్మికులు ఉన్నారు.

# గ్రామాలను అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం
- గుమ్మడిదల మండలంలో రూ.70 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**గుమ్మడిదల, జూన్ 29 (సిరి న్యూస్):**

గుమ్మడిదల మండలాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండల పరిధిలోని మంబాపూర్, నల్లవల్లి, కొత్తపల్లి, నాగిరెడ్డిగూడెం, అనంతారం, కానుకుంట గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) ద్వారా మంజూరైన రూ.70 లక్షల నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం ద్వారా జీవన ప్రమాణాలను మరింత మెరుగుపర్చేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడేలా పనులను నాణ్యతతో చేపట్టాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. నిర్ణయించిన గడువులోగా అన్ని అభివృద్ధి పనులను పూర్తి



చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పనుల అమలులో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించి అభివృద్ధిని వేగవంతం చేయాలని కోరారు. ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యం అని స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధిలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, ఎంపీడీవో ఉమాదేవి, తహసిల్దార్ పరమేశం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, సర్పంచులు శ్రీనివాస్, కొత్తకొండ భాస్కర్, కొరివి రాణి, దుర్గ, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా అమ్మవారి పల్లకి సేవ

**పాపన్నపేట్ జూన్ 29 సిరి న్యూస్:**



ప్రసిద్ధి చెందిన ఏడుపాయల వన దుర్గ భవాని ఆలయం వద్ద పౌర్ణమి సందర్భంగా అమ్మవారి పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద ఉన్న మాడవీధుల గుండా అమ్మవారి పల్లకి సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శంకర్ శర్మ, పార్థు శర్మ, రాజశేఖర్ శర్మ, రాజేష్ శర్మ, అచ్చనపల్లి శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి సాయిబాబా, మరియు భక్తులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ జూన్ 29(సిరి న్యూస్)**

సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా మెదక్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ , అదనపు కలెక్టర్ నగేష్ లు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణిలో 83 దరఖాస్తులు వచ్చాయన్నారు.అందులో భూ భారతి 33, ఇందిరమ్మ ఇండ్లు 14, పెన్షన్లు 4, సాధారణ 32, మొత్తం 83 దరఖాస్తుల స్వీకరించామన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలన్నారు.

# నిర్దేశిత కార్యచరణ ప్రకారం ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**మెదక్ జూన్, 29(సిరి న్యూస్)**

భారత ఎన్నికల సంఘం నిర్దేశిత కార్యాచరణ ప్రకారం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఈ.ఆర్.ఓ.లు, ఎ.ఈ.ఆర్.ఓ.లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ నిరేశిత కార్యచరణ ప్రకారం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, వివరాల నమోదు ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. జూలై 24వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి అర్హులైన ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, పూరించిన తర్వాత సేకరించాలని,ఫారాల పంపిణీ ప్రక్రియను జూలై 1వ తేదీ నాటికి పూర్తి చేసి ప్రతి రోజూ పురోగతి నివేదికలను సమర్పించాలని తెలిపారు. ప్రతి బూత్ స్థాయి అధికారి తమ పరిధిలోని ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించి, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో నమోదై ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరుగా




నమోదు కావడం చట్టరీత్యా శిక్షార్హమని ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పేర్లు, ఇంటిపేర్లు, మహిళల వివాహానంతర ఇంటిపేరు మార్పులు వంటి వ్యత్యాసాలను పరిశీలించి వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ప్రతి ఈ.ఆర్.ఓ., ఎ.ఈ.ఆర్.ఓ. క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ పనులను పర్యవేక్షించి, ప్రతి ఎన్యూమరేషన్ ఫారంపై సంబంధిత ఓటరు సంతకం ఉండేలా బూత్ స్థాయి అధికారులు నిర్ధారించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విధుల సమయంలో ప్రతి బూత్ స్థాయి అధికారి తప్పనిసరిగా గుర్తింపు కార్డు ధరించాలని, కొత్తగా నియమితులైన బూత్ స్థాయి అధికారులకు సంబంధిత ఈ.ఆర్.ఓ.లు వెంటనే గుర్తింపు కార్డులు జారీ చేసేలా చర్యలు తీసుకుంటు




న్నామని తెలిపారు.జిల్లాలో శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించి బూత్ స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయని, ఎన్యూమరేషన్ ఫారాలు, బి.ఎల్.ఓ. కిట్లు, ప్రచార సామగ్రి పంపిణీ పూర్తి చేయబడి, ఇంటింటి సర్వే కొనసాగుతోందని తెలిపారు. జిల్లాలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్ , నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ గఫార్ ఈ.ఆర్.ఓ.లు, ఎ.ఈ.ఆర్.ఓ.లు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిధులు మంజూరు పై హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు



| | | | | |
|---|---|---|---|---|
| | | | Chilipched Total | 27.50 |
| 11 | Yeldurthy | Andugulapalle | Construction of CC Roads and CC Drains in SC Colony of Andugulapalle (V) | 3.00 |
| 12 | Yeldurthy | Bandaposanpally | Construction of CC Roads and CC Drains in SC Colony of Bandaposanpally (V) | 3.00 |
| 13 | Yeldurthy | Damarancha | Construction of CC Roads and CC Drains in SC Colony of Damarancha (V) | 3.00 |
| 14 | Yeldurthy | Dharmaram | Construction of CC Roads and CC Drains in SC Colony of Dharmaram (V) | 3.00 |
| 15 | Yeldurthy | Elukapally | Construction of CC Roads and CC Drains in SC Colony of Elukapally (V) | 2.50 |
| 16 | Yeldurthy | Mahamadnagar Thanda | Construction of CC Roads and CC Drains in ST Colony of Mahamadnagar Thanda (V) | 2.00 |
| 17 | Yeldurthy | Sherila | Construction of CC Roads and CC Drains in SC Colony of Sherila (V) | 2.00 |
| 18 | Yeldurthy | Shamshireddypally | Construction of CC Roads and CC Drains in SC Colony of Shamshireddypally (V) | 2.00 |
| | | | Yeldurthy Total | 20.50 |

**వెల్దుర్తి, జూన్ 29,( సిరి న్యూస్ ):**



PROCEEDINGS OF THE DISTRICT COLLECTOR AND DPC, MGNREGS-TS, DRDA MEDAK DISTRICT.
Present: Smt. Pratima Singh, I.A.S.,

Proc. No. DRDA/721/CC Roads/2025-26 Dt. .06.2026

Sub: DRDA Medak - MGNREGS - Construction of CC Roads in Chilipched, Yeldurthy, Kulcharam, Kowdipally, Shivampet, Narsapur and Masaipet Mandals of Narsapur Constituency, Medak District for the year 2026-27 - Administrative Sanctioned under MGNREGS grants - Orders - Issued - Reg.

Ref: 1) MGNREGS Act, 2005 ( Central Act No.42 of 2005)
2) Go.Rt.No 761 PR&RD( Progs-I) Dept, Dt: 08.12.2017
3) Proposal submitted by the DPRE, Medak Dist., Lr. No. A2/ MGNREGS/CC Road/Narsapur LAC/2026, Dt:29.06.2026.

ORDER:

Through the reference 3rd cited, the District Panchayat Raj Engineer, Medak has submitted the proposal for Construction of CC Roads (74) No's of works with an Estimate Cost of Rs.200.00 Lakhs in Chilipched, Yeldurthy, Kulcharam, Kowdipally, Shivampet, Narsapur and Masaipet Mandals of Narsapur Constituency, Medak District under MGNEGS grants and requested for administrative sanction. The detailed particulars as shown below:

Abstract

| Sl. No. | Name of the Mandal | CC Roads No. of works | CC Roads Rs. (in lakhs) |
|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 |
| 1 | Chilipchedu | 10 | 27.50 |
| 2 | Yeldurthy | 8 | 20.50 |
| 3 | Kulcharam | 6 | 16.50 |
| 4 | Kowdipally | 17 | 43.50 |
| 5 | Shivampet | 15 | 41.00 |
| 6 | Narsapur | 15 | 42.00 |
| 7 | Masaipet | 3 | 9.00 |
| | TOTAL | 74 | 200.00 |

వెల్దుర్తి మండలంలోని 8 గ్రామ పంచాయతీల గాను సిసి రోడ్లు అలాగే డ్రైనేజీల కొరకై 20 లక్షల 50 వేల నిధులు మంజూరు అయ్యాయని ఇట్టి నిధులు విడుదల కొరకై నిరంతరం కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి కి జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ కి, వెల్దుర్తి మండల ప్రజల తరఫున గ్రామ పంచాయతీల సర్పంచు ల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, తలారి మల్లేష్, పత్రిక ప్రకటనలో తెలిపారు.

# సమర్థవంతమైన ఘన వ్యర్థాల నిర్వహణ

- పర్యావరణ పరిరక్షణకు, పరిశుభ్రతకు ఇది అత్యంత ముఖ్యం.
- జిల్లాలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్
- నియమాలు-2026ను సమర్థవంతంగా అమలు చేయాలి
- సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో వ్యర్థాలు నిలువ చేసేందుకు డస్ట్ బిన్స్ ఏర్పాటు ప్రారంభించిన కలెక్టర్.
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ జూన్,29 (సిరి న్యూస్)**

సమర్థవంతంగా ఘన వ్యర్థాల నిర్వహణ అమలు చేసేందుకు అధికారులతో ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులకు సూచించారు.సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నియమాలు–2026 కలెక్టరేట్ కార్యాలయం నుంచి ప్రారంభమైందన్నారు.సోమవారం కలెక్టరేట్లో వ్యర్థాలు నిలువ



చేసేందుకు ఏర్పాటు చేసిన డబ్బాలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకుపరిశుభ్రతకు ఆరోగ్యవంతమైన వాతావరణం కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమం పై ప్రజల్లో చైతన్యపరిచి సత్ఫలితాల దిశగా ముందుకు పోవాలన్నారు. వ్యర్థాలను తడి చెత్తను గ్రీన్ డబ్బాలో, పొడి చెత్తను బ్లూ డబ్బాలో, సానిటరీ చెత్తను రెడ్ డబ్బాలో, హానికరమైన చెత్తను బ్లాక్ డబ్బాలలో విడదీసి, వేరువేరుగా తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.సుప్రీంకోర్టు ఆదేశాలు, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఘన వ్యర్థాల నిర్వహణను శాస్త్రీయ పద్ధతిలో చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామాలు, పట్టణాల్లో తడి, పొడి వ్యర్థాలను వేరు చేసి సేకరించే విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని,




ఇంటింటి చెత్త సేకరణ, రవాణా, ప్రాసెసింగ్ ప్రక్రియలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త పారవేయడం, చెత్తను కాల్చివేయడాన్ని పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో చెత్త పేరుకుపోయే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణతో సమస్యను పరిష్కరించాలన్నారు. అపార్ట్మెంట్లు, పరిశ్రమలు, వాణిజ్య సముదాయాలు, విద్యాసంస్థలు, ఫంక్షన్ హాళ్లను బల్ వేస్ జనరేటరుగా గురించి, నిబంధనల ప్రకారం ముందుకు పోవాలన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డి ఆర్ ఓ అంబదాస్ రాజేశ్వర్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, , డీఎఫ్ఓ జోజి ఇతర శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పౌర సంబంధాల శాఖ సేవలు ప్రశంసనీయం

- ప్రత్యేక ఆకర్షణగాన ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక ఛాయాచిత్ర ప్రదర్శన.
- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్.



**మెదక్ జూన్, 29(సిరి న్యూస్)**

ప్రజావాణి సందర్భంగా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజాపాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక వివిధ శాఖల సంక్షేమ వారోత్సవాల కార్యక్రమాల విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చాయ చిత్ర ప్రదర్శనను జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ , అదరపు కలెక్టర్ నగేష్ ఇతర జిల్లా అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక విజయవంతంగా జిల్లాలో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అత్యంత చెరువు చేయాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మెదక్ జిల్లాలో అధికారులు ప్రజలు భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమాలను ఛాయాచిత్రాల రూపంలో ప్రజలు వీక్షించేందుకు ఈ చిత్ర ప్రదర్శన ప్రతి సోమవారం ఏర్పాటు చేయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్ర రాజు ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హస్మత్‌పేట్ ప్రభుత్వ భూమికి విముక్తి..

- రూ.800 కోట్ల ప్రభుత్వ భూమిపై హైడ్రా బ్రేక్..
- నోటరీ ప్లాట్ల గుట్టు రట్టు..అక్రమ నిర్మాణాల కూల్చివేత..
- బండి రమేష్ పోరాటంతో భూమికి రక్షణ..
- బాధితులకు బెడ్‌రూమ్ కాంగ్రెస్ భరోసా..

**బోయిన్‌పల్లి, జూన్ 29 ( సిరి న్యూస్ )**

ఓల్డ్ బోయిన్ సర్కిల్ 3 హస్మత్‌పేట్ డివిజన్‌లో సర్వే నంబర్–1లో దాదాపు 10 ఎకరాలకు పైగా విస్తరించి, సుమారు రూ.800 కోట్ల విలువ కలిగిన ప్రభుత్వ




భూమిపై హైడ్రా చేపట్టిన కూల్చివేతలు రాజకీయంగా, పరిపాలనాపరంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. నవాబుల ప్రైవేటు భూమిగా చూపిస్తూ నోటరీ ప్లాట్ల పేరుతో విక్రయించిన ఈ స్థలం వాస్తవానికి పురావస్తు శాఖకు చెందిన ప్రభుత్వ భూమేనని అధికారులు నిర్ధారించడంతో, భారీ పోలీసు బందోబస్తుతో అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. ఈ సందర్భంగా బోయిన్‌పల్లి కూరగాయల మార్కెట్ డైరెక్టర్ అస్లం సోఫీ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో కొందరు స్థానిక రాజకీయ నాయకులు, అప్పటి ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్, వారి అనుచరులు నవాబులతో కుమ్మక్కై ప్రభుత్వ భూమిని ప్రైవేటు భూమిగా ప్రచారం చేసి పేదలకు ప్లాట్లు విక్రయిస్తూ కోట్ల రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. ఈ అక్రమాలపై కాంగ్రెస్ పార్టీ తరఫున కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో తహసీల్దార్, టౌన్ ప్లానింగ్ అధికారులతో పాటు సంబంధిత శాఖలకు ఎన్నో ఫిర్యాదులు చేసినా, అప్పటి అధికారులు పట్టించుకోలేదని విమర్శిం చారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని, చివరకు ఈ భూమి ప్రభుత్వానిదేనని తేలిందన్నారు. ప్రభుత్వ భూమిని పరిరక్షించడంలో కూకట్‌పల్లి ఇంచార్జి బండి రమేష్ కీలక పాత్ర పోషించారని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తి సహకారం అందించారని అస్లం సోఫీ తెలిపారు. ఎన్నో ఏళ్లుగా సాధ్యం కాని పని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సాధ్యమైందని పేర్కొన్నారు. హైడ్రా కూల్చివేతలతో నష్టపోయిన బాధితుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అస్లం సోఫీ భరోసా ఇచ్చారు. బాధితులకు న్యాయం చేయడంతో పాటు, ఇదే ప్రభుత్వ భూమిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టే బాధ్యతను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బండి రమేష్ తీసుకుంటారని ఆయన వెల్లడించారు..



## చలికాలంలో

# వేన్నీళ్ల స్నానం మంచిదేనా?

చలికాలంలో చలి నుంచి ఉపశమనం పొందడానికి చాలా మంది వేడి నీళ్లతో స్నానం చేస్తుంటారు. సాధారణం కంటే ఎక్కువ వేడి కలిగిన నీటితో స్నానం చేసేందుకు ఇష్టపడుతుంటారు. వెచ్చగా ఫీల్ అవ్వడానికి వేడి నీటిలోనే ఉండాలని అనుకుంటూ ఉంటారు. అయితే అత్యధికంగా వేడి నీళ్లతో స్నానం చేయడం వల్ల అనేక సమస్యలు వస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. చర్మ సంబంధిత సమస్యలు కూడా వస్తాయని పేర్కొంటున్నారు. వేడి నీటితో స్నానం చేయడం వల్ల ఎలాంటి సమస్యలు వస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం..



### చర్మం పొడిగా మారుతుంది..

సాధారణంగా చలికాలంలో చర్మం పొడిగా మారుతుంది. గాలిలో తేమ తక్కువగా ఉండడం వల్ల చర్మం పొడిగా మారడంతో పాటు, పగిలిపోతుంటుంది. అయితే చలికాలంలో అధిక వేడి కలిగిన నీటితో స్నానం చేయడం వల్ల చర్మం డీహైడ్రేటెడ్‌గా మారుతుంది. దీని వల్ల చర్మం పొడిగా మారడంతో పాటు పగిలిపోతుంటుంది. అందుకే చలికాలంలో వేడి నీటితో స్నానం చేయడానికి బదులు, గోరు వెచ్చని నీటితో స్నానం చేయడం మేలు.

### జుట్టు కూడా రాలుతుంది..

వేడి నీటితో తల స్నానం చేయడం వల్ల జుట్టుకు కూడా సమస్యలు వస్తాయి. జుట్టు బలహీనంగా మారడంతో పాటు వేగంగా రాలిపోతుంటుంది. జుట్టులోని సహజసిద్ధమైన మెరుపు, తేమ ఉండకపోవచ్చు. వేడి నీటితో స్నానం చేయడం వల్ల జుట్టులోని కెరాటిన్, లిపిడ్ దెబ్బతిని జుట్టును బలహీనపరుస్తాయి. క్రమంగా జుట్టును పట్టుకున్నా రాలిపోయే ప్రమాదం ఉంది.

### గోరువెచ్చని నీరు అయితే ఒకే..

ఎక్కువగా వేడిగా ఉన్న నీటితో కాకుండా గోరు వెచ్చని నీటితో స్నానం చేయడం వల్ల ఈ సమస్యల నుంచి తప్పించుకోవచ్చు. గోరు వెచ్చని నీటితో స్నానం చేసినప్పటికీ పది నిమిషాలకు మించి చేయకూడదు. అలాగే స్నానం చేసిన వెంటనే శరీరానికి హైడ్రేటింగ్ క్రీమ్స్ వినియోగించాలి. దీని వల్ల చర్మంలోని తేమ అక్కడే ఉంటుంది. చర్మ సమస్యలు రాకుండా ఉంటాయి.

### ఇన్ఫెక్షన్స్, దురద

అధిక వేడి నీటితో స్నానం చేయడం వల్ల శరీరంలో సేబమ్ ఉత్పత్తికి ఆటంకం కలుగుతుంది. దీని కారణంగా శరీరంలో సహజమైన నూనె ఉత్పత్తి తగ్గిపోతుంది. దీని వల్ల చర్మ సంబంధిత సమస్యలు వస్తాయి. చర్మంపై దురద, ఇన్ఫెక్షన్స్ వచ్చే అవకాశం ఉంటుంది. పైగా చర్మం పొడిగా మారడంతో రంగు కూడా మారిపోయే ప్రమాదం ఉంది.

### ఈ సమస్యలు తీవ్రత మరింత అధికం

వేడి నీటితో స్నానం చేయడం వల్ల.. ఇప్పటికే సోరియాసిస్, ఎగ్జిమా, రోసాసియాలాంటి చర్మ సమస్యలతో బాధ పడుతున్న వ్యక్తులకు మరింత సమస్యగా మారుతుంది. చర్మం సహజసిద్ధమైన ఆయిల్స్ కోల్పోయి మరింత ప్రమాదకరంగా మారే ఛాన్సుంటుంది.



# ఉగ్గాని బజ్జీ ఇలా చేసుకోండి..!

డైలీ బ్రేక్ ఫాస్ట్ లోకి ఇడ్లీ,పూరీ,దోశె,వడ,బోండా తిని తిని బోర్ కొట్టేసిందా? కొత్తగా ఏదైనా బ్రేక్ ఫాస్ట్ లోకి ట్రై చేయాలనుకుంటున్నారా? అయితే త్వరగా రెడీ అయిపోయే ఉగ్గాని బెస్ట్ ఆప్షన్. చాలా టేస్టీగా ఉండే ఈ ఉగ్గానిని పెద్దలతో పాటు పిల్లలు కూడా చాలా ఇష్టంగా తింటారు. రాయలసీమతో పాటు కర్ణాటకలోని చాలా ప్రాంతాల్లో ఈ ఉగ్గాని బ్రేక్ ఫాస్ట్ గా చాలామంది తీసుకుంటారు. ముఖ్యంగా కర్నూల్ జిల్లాలో ఏ మూరుమూల గ్రామానికి వెళ్లిన దొరికే టిఫిన్ ఐటమ్ ఈ ఉగ్గాని. కర్నూల్ వాళ్లకి ఉగ్గాని అంటే కేవలం బ్రేక్ ఫాస్ట్ ఐటమే కాదు ఓ ఎమోషన్ కూడా. కర్నూల్ స్పెషల్ ఉగ్గానిని కేవలం 5 నిమిషాల్లోనే చేసుకోవచ్చు. ఉగ్గాని తయారీకి కావాల్సిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి.



### ఉగ్గాని తయారీకి కావాల్సిన పదార్థాలు

| |
|---|
| బొరుగులు |
| టమాటో |
| ఉల్లిపాయ |
| కరివేపాకు |
| ఆవాలు |
| జీలకర్ర |
| ఆయిల్ |
| శెనగపప్పు |
| ఎండు కొబ్బరి పొడి |
| ఎండుమిర్చి |
| పసుపు |
| కొత్తిమీర |
| ఉప్పు |
| కారం |

### ఉగ్గాని తయారీ విధానం

ముందుగా 200 గ్రాముల బొరుగులను నీళ్లల్లో వేసి బొరుగులను నీళ్లల్లో ముంచుతూ బాగా నానబెట్టండి. నానిన బొరుగులను గట్టిగా పిండి ఓ బౌల్ లో వేయండి. ఇప్పుడు అందులో రుచికి సరిపడా ఉప్పే వేసి కలపండి. ఇప్పుడు మిక్సీ గిన్నెలో మూడు ఎండుమిర్చి, 70 గ్రాముల వేసిప శెనగపప్పు,2 టేబుల్ స్పూన్ల ఎండు కొబ్బరి పొడి వేసి మెత్తని పొడి చేసుకొని దాన్ని ఓ ప్లేట్ లోకి తీసుకొని పక్కనపెట్టుకోండి. ఇప్పుడు 5 పచ్చిమిర్చి, రెండు రెబ్బల కకరివేపాకును రోట్లో లేదా మిక్సీలో వేసి కచ్చాపచ్చాగా దంచుకోండి. ఇప్పుడు స్టవ్ ఆన్ చేసి బాండీ పెట్టి అందులో మూడు టేబుల్ స్పూన్ల నూనె పోసి వేడి చేసుకోండి. వేడెక్కిన నూనెలో ఒక టీ స్పూన్ జీలకర్ర, ఒక టీ స్పూన్ ఆవాలు, రెండు ఎండు మిర్చి వేసి వేపండి. ఇప్పుడు మీడియం సైజ్ లో కట్ చేసుకున్న 1 ఉల్లిపాయ తరుగు, ఒక రెబ్బ కరివేపాకు బాండీలో వేసి రెండు నిమిషాలు వేపండి. ఇప్పుడు అందులో రెండు చిన్న టమోటోలను పెద్ద పెద్ద ముక్కలుగా కట్ చేసిన తరుగు,రెండు చిటికెళ్ల పసుపు, గ్రైండ్ చేసుకున్న పచ్చిమిర్చి మిశ్రమాన్ని వేసి టామాటోలు మెత్తబడి నూనె పైకి తేలేవరకు వేపండి. ఇప్పుడు ఇందులో అర టీ స్పూన్ కారం వేసి కలపి నానబెట్టిన బొరుగులు, గ్రైండ్ చేసి ప్లేట్ లో పెట్టుకొని ఉన్న పప్పుల పొడి, ఒక కట్ట కొత్తిమీర తరుగు,రుచికి తగినంత ఉప్పు వేసి బాగా కలబెట్టండి.ఒక నిమిషం తర్వాత స్టవ్ ఆఫ్ చేయండి అంతే కర్నూల్ స్పెషల్ ఉగ్గాని రెడీ.

## చలికాలంలో పెదవుల సంరక్షణకు

# ఈ టిప్స్ పాటించండి



చలికాలం వచ్చిదంటే ముఖ్యంగా వేధించే సమస్య పెదవులు పగలడం, కాళ్లు చేతులు పగులుతాయి. చలి కాలంలో అనేక రకాల సమస్యలు తరచుగా ప్రజలను ఇబ్బందికి గురి చేస్తాయి. జలుబు, ఇతర ఆరోగ్య సమస్యలే కాకుండా.. చర్మం, జుట్టు సంబంధిత సమస్యలు కూడా ఈ సీజన్‌లో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తాయి. శీతాకాలంలో చర్మానికి ప్రత్యేక శ్రద్ధ అవసరం.. చలికాలంలో గాలిలో తేమ ఉండదు. ఈ చల్లని, పొడి గాలి పెదవుల సున్నితమైన చర్మం నుంచి తేమను దూరం చేస్తుంది. దీంతో అవి పొడిబారి పగుళ్లు వస్తాయి. పెదవుల చర్మం చాలా సున్నితంగా ఉంటుంది. చలికాలం తగినంత నీరు తాగకపోవడం వల్ల చర్మం, పెదవులు పొడిబారిపోతాయి. చలికాలంలో పొడి, పగిలిన పెదాలను సహజంగా మృదువుగా మార్చే కొన్ని పెదవుల సంరక్షణ చిట్కాల గురించి తెలుసుకుందాం.



**నాలుకను పెదాలపై ఉంచొద్దు:**
తరచుగా పెదవులు పగిలినప్పుడు లేదా పొడిగా ఉన్నప్పుడు.. పెదవులపై ఉన్న చర్మాన్ని తొలగించడానికి వ్యక్తులు పదేపదే తమ నాలుకను పెదాలపై ఉంచుతారు. అలా చేయడం వల్ల పెదవులకు హానికరం. వాస్తవానికి, లాలాజలంలో ఎంజైమ్‌లు ఉంటాయి.. ఇది పెదవుల పొడిని మరింత పెంచుతుంది. దీంతో.. మరింత నొప్పి, రక్తస్రావం కలిగిస్తుంది.

**ధూమపానం మానుకోండి:**
పెదవుల సంరక్షణ విషయంలో ధూమపానానికి దూరంగా ఉండటం మంచిది. ధూమపానం మీ ఆరోగ్యానికి మాత్రమే కాకుండా మీ పెదాలకు కూడా హానికరం. ధూమపానం వల్ల వృద్ధాప్య ప్రక్రియ వేగవంతం కావడమే కాకుండా మీ పెదాల చర్మం దెబ్బతింటుంది.

**ఎక్స్‌ఫోలియేట్ చేయండి:**
మీరు మీ ముఖ చర్మాన్ని ఆరోగ్యంగా, మృదువుగా ఉంచడానికి ఎక్స్‌ఫోలియేట్ చేయాలి. మీ పెదవులపై మృత చర్మాన్ని తొలగించడానికి వారానికి 2 నుండి 3 సార్లు ప్రత్యేక లిప్ స్క్రబ్‌ని ఉపయోగించండి.

**నెయ్యి ఉపయోగించండి:**
మీరు మీ పెదాలను సహజంగా మృదువుగా చేయాలనుకుంటే నెయ్యిని ఉపయోగించవచ్చు. నెయ్యి మీ పెదాలకు తక్షణ తేమ, పోషణను అందిస్తుంది, ఇది పొడి, పగిలిన పెదవుల నుండి ఉపశమనాన్ని అందిస్తుంది. నెయ్యి చర్మం నునుపుగా.. ఎక్కువ కాలం తేమగా ఉంచడంలో సహాయపడుతుంది.

**పుష్కలంగా నీరు త్రాగండి:**
తరచుగా పర్యావరణ కాలుష్యం, పొడి గాలి వంటి కారణాల వల్ల పెదవులు పొడిగా, పగుళ్లు ఏర్పడతాయి. ఈ క్రమంలో మీ పెదవుల తేమకు గురికాకుండా ఉండటానికి పుష్కలంగా నీరు త్రాగాలి. సీజన్ ఏదయినా సరే.. మీరు ప్రతిరోజూ కనీసం 78 గ్లాసుల నీరు త్రాగడానికి ప్రయత్నించాలి.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.